
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
పెద్దపల్లి
జిల్లా వార్తలు
5★
శుక్రవారం 29 మార్చి 2024



అండర్‌గ్రౌండ్ గ్యాస్ పైప్‌లైన్ లీకేజీపై మాక్ డ్రిల్
నిర్వాసిత గ్రామాలపై ఎన్‌టీపీసీ నిర్లక్ష్యం
8లో..



కాంగ్రెస్ ఎంపీ టికెట్‌పై దుమారం



- మాదిగలకు ఇవ్వాలని నేతల డిమాండ్
- మాదిగ శక్తి ఆధ్వర్యంలో ఢిల్లీలో ధర్నా

(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

పెద్దపల్లి పార్లమెంటు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని మార్చాలంటూ మొదలైన దుమారం సద్దుమణగడం లేదు. పార్టీకి చెందిన మాదిగ సామాజికవర్గ నేతలు అసంతృప్తి వ్యక్తం చేస్తుండగా, సంఘాల నేతలు ఆందోళనలు చేస్తున్నారు. పెద్దపల్లి అభ్యర్థిగా మాజీ ఎంపీ, చెన్నూరు ఎమ్మెల్యే గడ్డం వివేక్ తనయుడు గడ్డం వంశీకృష్ణ పేరును ప్రకటించింది. దీంతో మాదిగ సామాజిక వర్గానికి చెందిన నేతలు భగ్గు మంటున్నారు. నియోజకవర్గం ఏర్పాటైన నాటినుంచి మాదిగ సామా జిక వర్గానికి చెందిన మాజీ మంత్రి ఆగం చంద్రశేఖర్‌కు మాత్రమే ఒకసారి టికెట్ ఇవ్వగా, మిగతా ఎన్నికల్లో మాల సామాజిక వర్గానికి చెందిన వాళ్లకే ఇస్తున్నారని, వాళ్లంతా స్థానికేతరులేనని చెబుతున్నారు. గత ఎన్నికల్లో చంద్రశేఖర్‌కు టికెట్ ఇవ్వగా గడ్డు పరిస్థితుల్లో కూడా పార్టీ మంచి ఓట్లు సాధించిందని చెబుతున్నారు.

ఇటీవల జరిగిన రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో పెద్దపల్లి పార్లమెంటు నియోజకవర్గంలోని ఏడు అసెంబ్లీ సెగ్మెంట్లలో కాంగ్రెస్ పార్టీకి చెందిన అభ్యర్థులే గెలవడం గమనార్హం. దీంతో పార్లమెంట్ ఎన్నికల్లో తమ గెలుపు సులభమేనని భావించిన మాదిగ సామాజిక వర్గానికి చెందిన అనేక మంది నాయకులు టికెట్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. సామాజిక సమీకరణాల దృష్ట్యా ఈసారి ఎలాగైనా పార్టీ మాదిగ సామాజిక వర్గానికి చెందిన వారికే టికెట్ ఇస్తుందని అంతా ఆశించారు. కానీ మాల సామాజిక వర్గానికి చెందిన వివేక్ తనయుడు వంశీ కృష్ణకు టికెట్ ప్రకటించడంతో అంతా ఖంగుతిన్నారు. మాదిగ సామాజిక వర్గానికి చెందిన నాయకులు మాజీ ఎంపీ డాక్టర్ సుగుణకుమారి, జాతీయ యువజన నాయకుడు ఊట్ల వరప్రసాద్, పార్టీ నాయకులు ఆసంపల్లి శ్రీనివాస్, గజ్జెల కాంతం, పెర్క శ్యామ్ తదితరులు టికెట్ కోసం గట్టిగానే ప్రయత్నాలు చేశారు. సామాజిక సమీకరణాల దృష్ట్యా రాష్ట్రంలో ఉన్న మూడు ఎస్సీ పార్లమెంటు నియోజకవర్గాల్లో కనీసం రెండు నియోజకవర్గాల్లోనైనా మాదిగ సామాజిక వర్గానికి చెందిన నేత లకు పార్టీ టికెట్ ఇస్తుందని భావించారు.

కేంద్రంలో అధికారంలో ఉన్న భారతీయ జనతా పార్టీ ఎస్సీ వర్గీకరణ చేస్తామని హామీ ఇచ్చింది. దీంతో మాదిగ సామాజిక వర్గానికి చెందిన ఓటర్లు ఆ పార్టీ వైపు మొగ్గు చూపే అవకాశాలు ఉండడంతో ఎలాగైనా పెద్దపల్లి టికెట్‌ను మాదిగలకు కేటాయిస్తారని ప్రచారం జరిగింది. మరోవైపు మాదిగ ఐక్య వేదిక, మాదిగశక్తి ఆధ్వర్యంలో ఆ పార్టీకి వినతిపత్రాలు అందజేశారు. మాదిగలకే టికెట్ ఇవ్వాలంటూ జిల్లా కేంద్రంలో ఐక్యవేదిక ఆధ్వర్యంలో పెద్దఎత్తున డప్పుల చాటింపు కార్యక్రమం కూడా నిర్వహించారు. మాదిగ శక్తి ఆధ్వర్యంలో ఢిల్లీకి వెళ్లి ఏఐసీసీ నేతలకు వినతిపత్రాలు కూడా అందజేశారు. కానీ పార్టీ గడ్డం వంశీకృష్ణ వైపై మొగ్గుచూపింది.

నేతల్లో అసంతృప్తి..

వివేక్ వారసుడిగా రాజకీయ అరంగేట్రం చేస్తున్న వంశీకృష్ణ మొట్ట మొదటిసారిగా ఎంపీగా పోటీ చేయబోతున్నారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు బీజేపీలో ఉన్న వివేక్ అనూహ్యంగా యూటర్న్ తీసుకొని తన కుమారుడితో పాటు కాంగ్రెస్ పార్టీ లో చేరారు. అసెంబ్లీ ఎన్నికల్లో వివేక్ చెన్నూరు నుంచి, ఆయన సోదరుడు వినోద్ బెల్లంపల్లి నుంచి పోటీ చేసి గెలుపొందారు. ఎంపీ అభ్యర్థిగా వంశీ కృష్ణకు టికెట్ ఇవ్వడంతో మిగతా నేతలు గుర్రు మంటున్నారు. ఒకే కుటుంబంలో ముగ్గురికి టికెట్ ఇవ్వడంపై తీవ్రమైన అభ్యంతరాన్ని వ్యక్తం చేస్తున్నారు.

పెద్దపల్లి నుంచి గడ్డం వెంకటస్వామికి ఆరుసార్లు, ఆయన కుమారుడు వివేక్‌కు రెండుసార్లు టికెట్ ఇచ్చిన పార్టీ మళ్లీ అదే కుటుంబానికి చెందిన వివేక్ వారసుడు వంశీకృష్ణకు టికెట్ ఎలా ఇస్తారంటూ పలువురు పార్టీ నేతలు ప్రశ్నిస్తున్నారు. పెద్దపల్లి టికెట్ ఆశించిన యువజన జాతీయ నాయకుడు ఊట్ల వరప్రసాద్ ఇటీవల ప్రెస్‌మీట్ ఏర్పాటు చేసి పార్టీ తీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. రాజకీయాల్లోకి వచ్చిన నాటి నుంచి పార్టీలోనే ఉంటూ పార్టీ జెండాలు మోస్తున్న వారిని కాదని, పలుసార్లు పార్టీలు మారి వచ్చిన ప్యారాచూట్ నేతలకు పార్టీ టికెట్ ఇవ్వడం ఏమిటని ఆయన ప్రశ్నించారు. ఈ నియోజక వర్గంలో గెలుపొందే సత్తా ఉన్న నాయకులే లేరా అని ఆయన ప్రశ్నించారు.

మాజీ కేంద్రమంత్రి గడ్డం వెంకటస్వామి రాజకీయ వారసులం తామేనని, వివేక్ తనయుడు కాదని ఆయన ఆక్రోషం వెళ్లగక్కారు. పార్టీ అభ్యర్థిని మార్చే విషయమై అధిష్టానం పునరాలోచన చేయాలని, లేదంటే వచ్చేనెల 5వ తేదీన పెద్దపల్లి నియోజకవర్గ కేంద్రంలో నిరసన దీక్ష చేపడతానని వరప్రసాద్ హెచ్చరించారు. మరోవైపు మాదిగ శక్తి ఆధ్వర్యంలో గురువారం ఢిల్లీలోని ఏఐసీసీ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. పెద్దపల్లి అభ్యర్థిని మార్చాలని, మాదిగ సామాజిక వర్గానికి చెందిన నేతలకు టికెట్ ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు.

అలాగే పార్టీకి చెందిన పలువురు ఎమ్మెల్యేలు వంశీకృష్ణకు టికెట్ ఇవ్వడంపై అసంతృప్తితో లోలోపల రగులుతున్నట్లు తెలుస్తున్నది. బీఆర్ఎస్ పార్టీ మాల సామాజిక వర్గానికి చెందిన మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్‌కు, బీజేపీ నేతకాని సామాజిక వర్గానికి చెందిన గొమాసే శ్రీనివాస్‌కు టికెట్ ఇవ్వగా, కాంగ్రెస్ పార్టీ కూడా అదే దారిలో నడిచినట్లు కనబడుతున్నది. అయితే ఈ వ్యవహారం మరింత రచ్చ గాకుండా ఉండేందుకు వివేక్ సోదరులు రంగంలోకి దిగి అసంతృప్త నేతలను బుజ్జగించే పనిలో నిమగ్నం అయ్యారని సమాచారం.



ఢిల్లీలో ధర్నా చేస్తున్న మాదిగ శక్తి నాయకులు

భ్రూణ హత్యలను అరికట్టేందుకు చర్యలు

- అదనపు కలెక్టర్ అరుణశ్రీ



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ అరుణశ్రీ

జ్యోతినగర్, మార్చి 28: భ్రూణ హత్యలను అరికట్టేందుకు చర్యలు చేపట్టాలని అదనపు కలెక్టర్ అరుణశ్రీ అన్నారు. మహిళా సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో బేటి బచావో భేటి పడావో కార్యక్రమంలో భాగంగా గురువారం ఎన్టీపీసీ టీటీఎస్ మిలీనియం హాల్‌లో లింగనిర్ధారణ పీసీపీఎన్‌డీటీ యాక్టుపై వర్క్‌షాప్ జరిగింది. అంగన్‌వాడీటీచర్లు, ఆశా వర్కర్లు, ఏఎన్ఎం, మెడికల్ ఆఫీసర్లకు పీసీపీఎన్‌డీటీ యాక్టుపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ అరుణశ్రీ మాట్లాడారు. భ్రూణ హత్యల కారణంగా స్త్రీల సంఖ్య వేగంగా తగ్గుముఖం పడుతుందన్నారు. భ్రూణ హత్యల నివారణకు కేంద్ర ప్రభుత్వం 1994లో పీసీపీఎన్‌డీటీ యాక్టు అమలులోకి తెచ్చినట్టు తెలిపారు. ఈ యాక్టు ప్రకారం లింగర్ధారణ చేసి గర్భస్రావం చేయించిన ఇరు వర్గాలను శిక్షించే వీలు కల్పించినట్టు పేర్కొన్నారు. మొదటి సారి తప్పునకు మూడేళ్ల జైలుశిక్ష, రూ.10వేల జరిమాన, రెండవసారి తప్పు చేస్తే ఐదేళ్ల జైలుశిక్ష, రూ.50వేల జరిమానా విధించేలా చట్టం రూపొందించబడినట్టు తెలిపారు. అనంతరం మహిళా సాధికారత కోఆర్డినేటర్ దయాఅరుణ మాట్లాడారు. ఫిర్యాదుల కోసం 104, 1098 టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేయాలని సూచించారు. జిల్లా సంక్షేమ అధికారి రావుఫ్‌ఖాన్ ఎన్నికల ప్రాముఖ్యత, ఓటు హక్కు గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో కృపాబాయి, డీసీపీఓ ఫర్వీన్, సీడీపీవోలు కవిత, స్వరూప రాణి తదితరులు పాల్గొన్నారు.

రామగుండం సీపీని కలిసిన ఆర్ఎఫ్‌సీఎల్ సీజీఎం

కోల్‌సిటీ, మార్చి 28: ఆర్ఎఫ్‌సీఎల్ చీఫ్ జనరల్ మేనేజర్ సుధీర్ కుమార్ ఝా గురువారం రామగుండం పోలీస్ కమిషనర్ ఎం శ్రీనివాస్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఆర్ఎఫ్‌సీఎల్‌లో ఉత్పత్తి, రక్షణ చర్యలతో పాటు వివిధ అంశాలను సీపీకి వివరించారు. ఆర్ఎఫ్‌సీఎల్ ఉత్పత్తి, నిర్వహణలో సహకారాలు అందించాలని, ఆర్ఎఫ్‌సీఎల్ ప్లాంట్‌ను సందర్శించాలని కోరారు.



సీపీ శ్రీనివాస్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఆర్ఎఫ్‌సీఎల్ సీజీఎం సుధీర్‌కుమార్ ఝా

రేపు హుండీ లెక్కింపు

ఓదెల, మార్చి 28 : భ్రమరాంబ మల్లికార్జున స్వామి క్షేత్రంలో 30న హుండీ లెక్కింపు నిర్వహించనున్నట్లు ఆలయ కార్య నిర్వహణ అధికారి సదయ్య తెలిపారు. ఈ లెక్కింపులో ఆసక్తి ఉన్నవారందరూ పాల్గొనాలని తెలిపారు.

తాగునీటి సమస్య లేకుండా చర్యలు

- ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్



మల్లాపూర్‌లో తాగునీటి ఎద్దడి గురించి అడ్లూరికి వివరిస్తున్న మహిళలు

ధర్మారం, మార్చి 28: తాగునీటి సమస్య లేకుండా అన్ని చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అధికారులకు సూచించారు. గురువారం మండలంలోని మల్లాపూర్ ఎస్సీ కాలనీలో ఆయన సమస్యలను తెలుసుకున్నారు. ఎస్సీ కాలనీలో తాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్నామని అక్కడి మహిళలు ప్రభుత్వ విప్‌కు విన్నవించారు. స్పందించిన ప్రభుత్వ విప్ కాలనీలో తాగునీటి సమస్య తీర్చడం కోసం బోర్‌వెల్ మంజూరు చేస్తున్నట్టు చెప్పారు. అధికారులు చర్యలు తీసుకోవాలని ఆయన చెప్పారు. గ్రామంలో ఏదేని సమస్య ఉంటే తన దృష్టికి తీసుకువస్తే సమస్య పరిష్కరిస్తానని ఆయన తెలిపారు. వెంట గాగిరెడ్డి తిరుపతిరెడ్డి, మహేందర్, మహిపాల్, దేవేందర్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.

ఎల్లంపల్లి పైపులైన్ ద్వారా పంటలకు సాగునీరు..

ఎల్లంపల్లి ప్రాజెక్ట్ నుంచి నిర్మించిన రెండు పైపులైన్ల ద్వారా పంటలకు సాగునీరు అందిస్తున్నట్టు ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ తెలిపారు. గురువారం మండలంలోని మల్లాపూర్ వద్దగల ఎల్లంపల్లి పైపులైన్ ఎయిర్‌వాల్వ్‌ను ఆయన ఓపెన్‌చేసి సాగునీటిని విడుదల చేశారు. రైతులు సాగు చేసిన పంటలు ఎండిపోకుండా ప్రత్యామ్నాయంగా ఎల్లంపల్లి పైపులైన్ ద్వారా సాగునీటిని అందించుటకు ప్రభుత్వం చర్యలు తీసుకుందని చెప్పారు. పాలకుర్తి మండలం వేమునూర్ వద్దగల ఎల్లంపల్లి ప్రాజెక్ట్ పంప్‌హౌస్ నుంచి రెండు పైపులైన్ల ద్వారా నంది మేడారంలోని నంది రిజర్వాయర్‌లోకి చేరిన తర్వాత అక్కడి నుంచి చెరువులు కుంటలతో పాటు పంట పొలాలకు సాగునీరు అందుతుందని ఆయన వివరించారు. ఈ విధంగా పైపులైన్ ద్వారా సాగునీటి విడుదల చేయడం వలన పంటలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని ఆయన తెలిపారు. ఈ పైప్‌లైన్ ద్వారా ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని గంగాధర మండలం నారాయణపూర్ చెరువు ద్వారా పలు చెరువుల్లోకి నీరు చేరుతుందని ఆయన వివరించారు. సంబంధిత అధికారులు నీటి విడుదలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ పంటలకు సాగునీరు చేరే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు.

ఆయన వెంట కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గాగిరెడ్డి తిరుపతిరెడ్డి, మాజీ ఎంపీటీసీ మహేందర్, రైతులు ఉన్నారు.

రోడ్డు విస్తరణ పనులను పరిశీలించిన కమిషనర్



చీకురాయి రోడ్డును పరిశీలిస్తున్న కమిషనర్

పెద్దపల్లిటౌన్, మార్చి 28: పెద్దపల్లి పట్టణంలో చేపడుతున్న రోడ్డు విస్తరణ పనులను గురువారం కమిషనర్ వెంకటేష్ పరిశీలించారు. పనులపై స్థానికులు అసహనం వ్యక్తం చేస్తూ పడాల సతీష్‌గౌడ్ ఆధ్వర్యంలో బుధవారం నిరసన చేపట్టారు. రోడ్డుకు ఇరువైపులా సమానంగా విస్తరణ చేపట్టాలని డిమాండ్ చేశారు. దీంతో కమిషనర్ రోడ్డును పరిశీలించిన అనంతరం మాట్లాడారు. టౌన్ ప్లానింగ్ నిబంధన ప్రకారం డాక్యుమెంటు పరిశీలించి పనులు కొనసాగిస్తామన్నారు. ఇంటి యజమానులతో సమావేశం ఏర్పాటుచేసి రాజీ కుదిరే విధంగా చర్యలు తీసుకుంటామని, లేకుంటే టౌన్ ప్లానింగ్ శాఖ నోటీసులు జారీచేసి నిర్మాణాలను తొలగిస్తామన్నారు. ఒకటి రెండు ఫీట్లకు మినహా యింపు ఇస్తామన్నారు. వెంట డీపీవో తిరుపతమ్మ, అనీల్, నల్లగొండ కుమార్, ఉన్నారు.

పారిశుధ్య పనులను పరిశీలించిన చైర్‌పర్సన్



పనులను పర్యవేక్షిస్తున్న చైర్‌పర్సన్ గాజుల లక్ష్మి

సుల్తానాబాద్, మార్చి 28: సుల్తానాబాద్ మున్సిపాలిటీ పరిధిలో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమం చేపట్టినట్లు మున్సిపల్ చైర్ పర్సన్ గాజుల లక్ష్మి రాజమల్లు అన్నారు. గురువారం పట్టణంలోని ఏడో వార్డులో పారిశుధ్య కార్యక్రమాన్ని లక్ష్మి పర్యవేక్షించారు. యాదవ నగర్ పరిసర ప్రాంతాలలో పరిసరాల పరిశుభ్రత వ్యక్తి పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రజలందరూ పారిశుధ్య నిర్వహణపై బాధ్యతగా వ్యవహరించాలని అన్నారు. తడి, పొడి చెత్త వేర్వేరుగా ఉంచి ఇంటికి వచ్చే పారిశుధ్య సిబ్బందికి అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ కూకట్ల గోపి, శానిటరీ జవాన్లు రాజ్ కుమార్, అనంత్, సిబ్బంది పాల్గొన్నారు.

‘స్వీప్’ ద్వారా ఓటు ప్రాముఖ్యాన్ని వివరించాలి

- స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జే.అరుణ

పెద్దపల్లిటౌన్, మార్చి 28: బాధ్యత గల పౌరులుగా ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకునేలా ఓటు ప్రాముఖ్యత వివరిస్తూ స్వీప్ కార్యక్రమాలు నిర్వహించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జే.అరుణశ్రీ పేర్కొన్నారు. గురువారం కలెక్టరేట్‌లో పార్లమెంట్ ఎన్నికలలో పోలింగ్ శాతం పెరిగేలా స్వీప్ కార్యక్రమాల నిర్వహణపై సంబంధిత అధికారులతో అదనపు కలెక్టర్ సమీక్షించారు. ఈసందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని 3అసెంబ్లీ సెగ్మెంట్ల పరిధిలో మొత్తం 7లక్షల 15వేల 735 మంది ఓటర్లు ఉన్నారని, ప్రతి ఒక్క ఓటరు ఎన్నికల్లో తప్పనిసరిగా తమ ఓటు హక్కు వినియోగించుకునేలా ఓటు ప్రాముఖ్యతపై విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జిల్లాలో ఓటర్లను చైతన్యపరిచేందుకు, ఓటింగ్ శాతం పెరిగేలా, ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకునేలా అవగాహన కల్పించేందుకు ఓటర్ అవగాహన కార్యక్రమాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. గత ఎన్నికల్లో తక్కువ పోలింగ్ నమోదైన ప్రాంతాలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని అదనపు కలెక్టర్ సూచించారు. స్వీప్ కార్యక్రమాల్లో భాగంగా జిల్లాలో ఉన్న అన్ని విద్యాసంస్థల్లో ఎలక్టోరల్ లిటరసీ క్లబ్‌లు ఏర్పాటు చేయాలని, జిల్లాలో ఉన్న అన్ని డిగ్రీ, ఇంజనీరింగ్ కళాశాలలలో క్యాంపస్ అంబాసిడర్లను నియమించాలని, 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరిని ఓటరు జాబితాలో నమోదు చేసి వారి ఓటు హక్కు వినియోగించుకునేలా అవగాహన కల్పించాలన్నారు. జిల్లాలోని ప్రతి గ్రామపంచాయతీలో ప్రత్యేక గ్రామసభలను ఏర్పాటు చేసి ఓటరు నమోదు, వినియోగంపై అవగాహన కల్పించాలన్నారు. ఓటు హక్కు ప్రాముఖ్యత వివరించే కరపత్రాలను పంపిణీ చేయాలని, వైద్య, ఆరోగ్య శాఖ పరిధిలో ఉన్న ఆశా వర్కర్లు, ఏఎన్ఎంల ద్వారా ఓటు ప్రాముఖ్యతను వివరించాలన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో కమ్యూనిటీ హెల్త్ సెంటర్లలో, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో సబ్ సెంటర్లలో ఓటు హక్కు ప్రాముఖ్యత వివరించేలా గోడ ప్రతులను ప్రదర్శించాలని, జిల్లాలో ఉన్న దివ్యాంగులు, ట్రాన్స్ జెండర్స్, సీనియర్ సిటిజన్లు తప్పనిసరిగా ఓటుహక్కు వినియోగించుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో ఉన్న వృద్ధాశ్రమాలు, దివ్యాంగుల సంస్థలలో ఓటర్ అవగాహన కల్పించాలని, వృద్ధులు, దివ్యాంగులకు అవసరమైతే ఇంటివద్ద ఓటు హక్కు వినియోగించుకునే అవకాశం ఉందని వివరించాలన్నారు. రామగుండంలో ఉన్న సింగ రేణి మైనింగ్ ఏరియా, ఎన్టీపీసీ, కేశోరాం ఫ్యాక్టరీ, ఆర్ ఎఫ్‌సీఎల్ మొదలగు సంస్థల్లో పనిచేసే కార్మికుల కోసం ప్రత్యేక ఓటర్ నమోదు, అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఆర్డీవోలు హనుమా నాయక్, గంగయ్య, జడ్పీ సీఈవో నరేందర్, డీఆర్‌డీవో రవీందర్, డీపీవో ఆశాలత, డీఈవో మాధవి, స్వీప్ యాక్టివిటీస్ నోడల్ అధికారి రౌఫ్‌ఖాన్, డీఎంహెచ్‌వో డాక్టర్ ప్రమోద్ కుమార్, ఇంటర్మీడియేట్ జిల్లా అధికారి కల్పన, పరిశ్రమలశాఖ జీఎం మధుసూదనాచారీ పాల్గొన్నారు.

మాదిగ సామాజిక వర్గానికి కాంగ్రెస్ ఎంపీ టికెట్ ఇవ్వాలి

- కాంగ్రెస్ సేవాదళ్ జిల్లా అధ్యక్షుడు బొల్లి స్వామి

ధర్మారం, మార్చి 28: పెద్దపల్లి ఎంపీ కాంగ్రెస్ టికెట్‌ను మాదిగ సామాజిక వర్గానికి ఇవ్వాలని పార్టీ సేవాదళ్ జిల్లా అధ్యక్షుడు బొల్లి స్వామి అధిష్ఠానాన్ని కోరారు. గురువారం ధర్మారంలో కాంగ్రెస్ సేవాదళ్ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెద్దపల్లి పార్లమెంట్ పరిధిలో నాలుగు లక్షల మంది మాదిగ ఓటర్లు ఉన్నారని, కేవలం 60వేల ఓటర్లు ఉన్న మాలలకు ఎంపీ టికెట్ ఇవ్వడం విడ్డూరమని అన్నారు. వెంకటస్వామి కుమారుల్లో వివేక్ చెన్నూర్, వినోద్ బెల్లంపల్లి ఎమ్మెల్యేలుగా గెలుపొందారని, మళ్లీ వివేక్ కుమారుడు వంశీకి పెద్దపల్లి ఎంపీ టికెట్ ఇవ్వడం సరైందని ఆయన పేర్కొన్నారు. పార్టీ కోసం కష్టపడి పని చేసిన నాయకులను గుర్తించి టికెట్ ఇవ్వాలని ఆయన కోరారు. చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్ కుమారుడు వంశీకి ఇచ్చిన టికెట్‌ను కాంగ్రెస్ అధిష్ఠానం వెనక్కి తీసుకుని స్థానికంగా ప్రజా సమస్యలపై అవగాహన ఉన్న, పార్టీ కోసం కష్టపడి పని చేసిన మాదిగ వర్గానికి చెందిన పెర్క శ్యామ్‌కు టికెట్ ఇవ్వాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో మాదిగ మహాదండు జిల్లా అధ్యక్షుడు చొప్పదండి రాములు, ఎంఆర్‌పీఎస్ ఉమ్మడి జిల్లా నాయకుడు గొట్టె లింగయ్య, బొమ్మన రమేష్, కాంగ్రెస్ నాయకుడు కాంపెల్లి పోచయ్య, మాదిగ మహాదండు మండల అధ్యక్షుడు రల్లెపల్లి రాజయ్య, ముదిరాజ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పెసరు స్వామి, జాతీయ అంబేద్కర్ మండల శాఖ అధ్యక్షుడు కాంపెల్లి జీవన్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ మళ్లీ అధికారంలోకి వస్తే రాజ్యాంగం రద్దు

- సాగునీరు లేక పొలాలు ఎండుతున్నా పట్టించుకోని ప్రభుత్వం
- బీఆర్ఎస్ నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్, మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్

గోదావరిఖని, మార్చి 28: బీజేపీ మళ్లీ అధికారంలోకి వస్తే రాజ్యాంగం రద్దు అవుతుందని బీఆర్ఎస్ నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్, మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. గురువారం స్థానిక శ్రీనగర్‌లోని ఒక ప్రైవేట్ హోటల్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ప్రభుత్వం ప్రభుత్వం ఏర్పాటు చేసిన మొదటి రోజే రాజ్యాంగం రద్దు అవుతుందని, దేశం చీకటిమయం అవుతుందన్నారు. కొత్త రాజ్యాంగాన్ని తీసుకువస్తే రిజర్వేషన్లు రద్దు అవుతాయని, ప్రాథమిక హక్కులు కోల్పోతామని, మతపరమైన హక్కులు పోతాయని, బీసీలు, ఎస్‌టీ, ఎస్‌సీలు, మైనార్టీలు నష్టపోతారన్నారు. మూతికి ముంత, నడుముకు ముంత కట్టుకోవాల్సిన పరిస్థితి మళ్లీ ఏర్పడుతుందన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్, దేశంలో బీజేపీని ఓడించాలని వారు పిలుపునిచ్చారు. మతోన్మాదం పేరుతో ఓట్లు అడగడానికి వస్తున్న బీజేపీకి తగిన బుద్ధి చెప్పాలని, బీజేపీని ఓడించడమే ధ్యేయంగా ప్రతి ఒక్కరూ పని చేయాలని పిలుపునిచ్చారు. ఢిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్ అరెస్టును రాహుల్ ఖండిస్తే, రాష్ట్రంలో రేవంత్ మౌనంగా ఉన్నాడని, ఇదంతా డబుల్ గేమ్ అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరి చూస్తే ప్రజలను నవ్వుకుంటున్నారని, రేవంత్‌రెడ్డి మాటలు గారడీలా ఉన్నాయని, బీఆర్ఎస్‌ను నామరూపాలు లేకుండా చేస్తామని ప్రగల్బాలు పలుకుతున్నారని విమర్శించారు. ఇప్పటికి ఇచ్చిన హామీలను నెరవేర్చలేదని, ఇంత వరకు ఉద్యోగ నోటిఫికేషన్ విడుదల చేయలేదని, పంటలు ఎండిపోతున్నా పట్టించుకోవడం లేదన్నారు. రైతులకు సాగునీటిని అందించడంలో ప్రభుత్వం విఫలమైందని, సాగునీటిని అందించాలంటూ ఈనెల 30 పెద్దపల్లి జిల్లా కేంద్రంలో 36 గంటలు రైతులకు మద్దతుగా దీక్ష చేపట్టనున్నట్టు, ఈ దీక్షను విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు. మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ మాట్లాడుతూ ప్రజలను మోసం చేసి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్‌కు పార్లమెంట్ ఎన్నికల్లో ఓట్లు వేయవద్దని కోరారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తరువాత ఢిల్లీ పెద్దలకు వేల కోట్లు ఇస్తున్నారే తప్ప రాష్ట్ర ప్రజలకు చేసిందేమి లేదన్నారు. వివేక్ కుటుంబం రిజర్వేషన్ ఉన్న స్థానంలో పోటీ చేయడం ఏమిటని ఆయన ప్రశ్నించారు. జనరల్ సీటులో పోటీ చేయవచ్చు కదా, అలా కాకుండా ఇక్కడ దళితులు లేనట్టు వివేక్ కుమారునికి టికెట్ ఇవ్వడం సరైంది కాదన్నారు. డబ్బులిచ్చి టికెట్లు కొనుగోలు చేశారని ఆరోపించారు.

ఈ విలేకరుల సమావేశంలో మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్, బీఆర్ఎస్ నాయకులు కౌశిక హరి, పెంట రాజేష్, జనగామ కవిత సరోజిని, మురళీధర్‌రావు, తోడేటి శంకర్‌గౌడ్, మెతుకు దేవరాజు, చల్లగురుగుల మొగిలి, అచ్చె వేణు, ఐ సత్యం తదితరులు పాల్గొన్నారు.

పచ్చునూర్‌లో కేంద్ర బలగాల కవాతు

మానకొండూర్, మార్చి 28: పార్లమెంట్ ఎన్నికలలో ఏలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా మండలంలోని పచ్చునూర్ గ్రామంలో గురువారం స్థానిక సీఐ రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో కేంద్ర బలగాలు కవాతు నిర్వహించాయి. గ్రామంలోని ప్రధాన వీధుల గుండా కేంద్ర బలగాలు, స్థానిక పోలీసులు కవాతును నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ రాజ్‌కుమార్ మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా ప్రజలకు భరోసా కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

హత్య కేసులో నిందితుడి అరెస్టు

- వివరాలు వెల్లడించిన ధర్మపురి సీఐ రాంనర్సింహారెడ్డి

ధర్మపురి, మార్చి 28: ధర్మపురి మండలంలోని కమలాపూర్ గ్రామంలో పులి పద్మ అనే మహిళను హత్య చేసిన కేసులో నిందితుడు పులి గంగయ్య గురువారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు జగిత్యాల డీఎస్పీ రఘుచందర్ తెలిపారు. స్థానిక పోలీస్ సర్కిల్ కార్యాలయంలో ధర్మపురి సీఐ రాంనర్సింహారెడ్డితో కలిసి ఏర్పాటు చేసిన నిందితుడి అరెస్ట్ వివరాలు ఆయన వెల్లడించారు. పులి పద్మకు ఆమె ఇంటి పక్కనే ఉన్న పులి గంగయ్యకు కొంత కాలం నుంచి భూమి సరిహద్దు విషయంలో గొడవలు జరుగుతున్నాయని ఆయన పేర్కొన్నారు. గ్రామంలో కాటమయ్య పండుగ జరుగగా నిందితుడు గంగయ్య హాజరయ్యాడని ఆయన తెలిపారు. ఆ సమయంలో గంగయ్య భార్య పులి రేణుక ఇంటిలో ఎవరు లేని సమయంలో వంట గదిలో చీరెతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు ఆయన వివరించారు. నిందితుడు గంగయ్య ఇంటికి వచ్చి చూసే సరికి భార్య చనిపోయి ఉండటం వల్ల పులి పద్మనే కారణమని భావించి ఉలి తీసుకుని ఆమెను ఇంట్లో విచక్షణా రహితంగా పొడిచి హత్య చేసినట్లు ఆయన అన్నారు. పద్మ భర్త లక్ష్మయ్య ఫిర్యాదు మేరకు నిందితుడు గంగయ్యను అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించి, రిమాండ్‌కు పంపించినట్లు తెలిపారు. సమావేశంలో ధర్మపురి సీఐ రాంనర్సింహారెడ్డి, ఎస్ఐ ఉదయ్‌కుమార్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

రూ.7,500 పలికిన పత్తి ధర

జమ్మికుంట రూరల్, మార్చి 28: జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో క్వింటాల్ పత్తి ధర 7,500 రూపాయలు పలికింది. గురువారం మార్కెట్ యార్డుకు 46మంది రైతులు 609క్వింటాళ్ల విడి పత్తి, ఎనిమిది మంది రైతులు పది క్వింటాళ్ల గోనె సంచుల్లో విక్రయానికి తీసుకు వచ్చారు. ప్రైవేట్ ట్రేడర్స్ బహిరంగ వేలం పాట ద్వారా గరిష్ఠ ధర 7,500, కనిష్ఠ ధర 4వేల రూపాయలు చెల్లించి పత్తి కొనుగోళ్లు చేపట్టారు. శుక్ర, శని, ఆదివారాల్లో కొనుగోళ్లు ఉండవని, తిరిగి సోమవారం నుంచి ప్రారంభం అవుతాయని అధికారులు తెలిపారు.

పీఆర్ ఏఈకి షోకాజ్ నోటీసులు జారీ

ఇల్లందకుంట, మార్చి 28: ఇల్లందకుంట మండల పంచాయతీరాజ్ ఏఈ రాంబాబుకు జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి షోకాజ్ నోటీసులు గురువారం జారీ చేశారు. ఇల్లందకుంట, వీణవంక మండలాలకు చెందిన జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద బోగంపాడు, ఇల్లందకుంట, వంతడుపుల గ్రామాలకు రూ. 30లక్షలు అంతర్గత రోడ్లకు నిధులు మంజూరయ్యాయి. కాగా పనులు చేపట్టడంలో ఏఈ రాంబాబుకు నిర్లక్ష్యం గా వ్యవహరించడంతో జిల్లా కలెక్టర్ నోటీసులు జారీ చేశారు. జిల్లాలోని అన్ని గ్రామాల్లోని ఈజీఎస్ పనులు మార్చి 31లోపు పూర్తి చేయాలని ఆదేశాలు జారీ చేశారు.

విద్యుత్ స్తంభంపై నుంచి పడి ఒకరికి తీవ్రగాయాలు

మానకొండూర్, మార్చి 28: మానకొండూర్‌లో గురువారం విద్యుత్ స్తంభం పై నుంచి పడి జూనియర్ లైన్‌మన్‌కు తీవ్రగాయాలు అయ్యాయి. మానకొండూర్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో పని చేస్తున్న జూనియర్ లైన్‌మెన్ బాలక్రిష్ణ 33కేవి లైన్ బ్రేక్‌డౌన్ మరమ్మతు పనులు చేస్తున్నారు. ప్రమాదవశాత్తు విద్యుత్ స్తంభంపై నుంచి కిందపడి తీవ్రగాయాల పాలయ్యాడు. చికిత్స నిమిత్తం కరీంనగర్‌లోని ఓ ఆసుపత్రికి తరలించారు. సబ్‌స్టేషన్‌లో పూర్తి స్థాయిలో సిబ్బంది ఉన్నప్పటికీ జూనియర్ లైన్‌మన్‌తో పనులు చేయించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా అధ్యక్షులు నలువల స్వామి డిమాండ్ చేశారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

తిమ్మాపూర్, మార్చి 28: మండలంలోని కొత్తపల్లి గ్రామంలో వినియోగం లోకి ఓ పెట్రోల్ బంక్ ఖాళీ స్థలంలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభించింది. ఎల్ఎండీ ఎస్సై చేరాలు తెలిపిన వివరాల ప్రకారం.. ఖాళీ స్థలములో కొబ్బరి చెట్ల కింద గుర్తు తెలియని మగ వ్యక్తి శవం ఉన్నట్లు స్థానికులు ఇచ్చిన సమాచారంతో పోలీసులు వెళ్లి పరిశీలించారు. అతడు 15 రోజులుగా గ్రామంలో మానసిక స్థితి బాగాలేక రోడ్డు వెంబడి తిరిగినట్లు స్థానికులు తెలిపారు. ఎండ వేడిమికి వడదెబ్బ కారణంగానే అతడు మృతి చెంది ఉంటాడని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. గ్రామ పంచాయితీ కార్యదర్శి అరుణ్ కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు. మృతదేహన్ని కరీంనగర్‌లోని ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీకి తరలించామని ఎస్సై చేరాలు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

పెద్దపల్లి రూరల్, మార్చి 28 : పెద్దపల్లి మండలం అప్పన్నపేట గ్రామానికి చెందిన పుట్ట మల్లయ్య(51) ద్విచక్ర వాహనం ఢీకొని చికిత్స పొందుతూ మృతిచెందాడు. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. మల్లయ్య కేశోరాం సిమెంట్ ఫ్యాక్టరీలో కాంట్రాక్టు ఉద్యోగం చేస్తున్నాడు. బుధవారం పనులు ముగించుకొని ఇంటికి సైకిల్‌పై వస్తున్న క్రమంలో అందుగులపల్లి గ్రామానికి చెందిన ద్విచక్ర వాహనదారుడు పుల్లూరి గట్టయ్య ఢీకొట్టాడు. దీంతో మల్లయ్య తలకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, మెరుగైన చికిత్స కోసం కరీంనగర్ తరలించారు. చికిత్స పొందుతూ అదే రాత్రి మృతిచెందినట్లు తెలిపారు. మృతుడి కుమారుడు పుట్ట సతీష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు బసంత్‌నగర్ ఎస్‌ఐ స్వామి తెలిపారు.

ఆర్టీసీ బస్సులో అస్వస్థతకు గురై ప్రయాణికుడి మృతి

మెట్‌పల్లి, మార్చి, 28 : మెట్‌పల్లి పట్టణ శివారులో ఆర్టీసీ బస్సులో ప్రయాణిస్తున్న భోగం సామయ్య(70) అనే వృద్ధుడు అస్వస్థతకు గురై చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం..కరీంనగర్ జిల్లా వీణవంక మండలానికి చెందిన భోగం సామయ్య కుటుంబ సభ్యులతో కలిసి నిజామాబాద్‌లో ఉంటున్నాడు. పనుల నిమిత్తం తన సొంత గ్రామానికి వెళ్లి తిరిగి గురువారం తన చెల్లెలితో కలిసి హుజూరాబాద్ డిపోకు చెందిన బస్సులో నిజామాబాద్‌కు బయలు దేరారు. మెట్‌పల్లి పట్టణ అనుబంధ గ్రామమైన వెంకట్రావుపేట చేరుకోగానే సామయ్య ఊపిరాడక పడిపోయాడు. గమనించిన తోటి ప్రయాణికులు వెంటనే 108కు సమాచారం ఇచ్చారు. సంఘటన స్థలానికి వచ్చిన అంబులెన్స్‌లో సామయ్యను మెట్‌పల్లి ప్రభుత్వ ఆసపత్రికి తరలించారు. వైద్యులు పరిశీలించి అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. పరిమితికి మించి ప్రయాణికులు బస్సులో ఎక్కడంతో ఊపిరాడక గుండె పోటు వచ్చి మృతి చెందినట్లు ప్రయాణికులు పేర్కొన్నారు.

ఉత్తమ రైతుకు సన్మానం


రైతును సన్మానిస్తున్న శాస్త్రవేత్తలు

రాయికల్, మార్చి 28: ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వ విద్యాలయంలో గురువారం విస్తరణ సలహా సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాయికల్ మండలం అల్లీపూర్ గ్రామానికి చెందిన ఓరుగంటి భీమరాజ్‌ను ఉత్తమ రైతుగా ఘనంగా సన్మానం చేశారు. రైతులు వారు పండించిన పంటలపై వారికి ఉన్న సమస్యల పరిష్కారం, పెట్టుబడి తగ్గించి ఎక్కువ లాభాలను ఏ విధంగా సమకూర్చుకోవచ్చునని శాస్త్రవేత్తలు వివరించారు. కార్యక్రమంలో ఏడీఆర్ డాక్టర్ జి.శ్రీనివాస్, అల్లీపూర్ దత్తత గ్రామ ఇన్‌చార్జి డాక్టర్ డీఏ రజనీ దేవి, ఆర్థిక శాస్త్రవేత్త, పొలాస శాస్త్రవేత్తల బృందం, అల్లీపూర్ ఎఫ్‌ఈవో అధ్యక్షుడు అత్తినేని శంకర్, రైతులు ఓరుగంటి రాజలింగం, ఓరుగంటి రాజు, ఎల్లేశ్వరం శేఖర్, గొల్లపల్లి అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్ సాగుపై రైతులకు అవగాహన


హుజూరాబాద్‌రూరల్, మార్చి 28: మండలంలోని ఇప్పలనర్సింగాపూర్ గ్రామంలో తెలంగాణ ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో గురువారం లోహియా ఎడిబుల్ ఆయిల్ కంపెనీ సిబ్బంది ఆయిల్‌పామ్ సాగుపై రైతులకు అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా కంపెనీ సీఈవో సిద్దాంత్ లోహియా రైతులు వేసవి కాలంలో మొక్కలకు సరిపడా నీరు అందించాలన్నారు. కార్యక్రమంలో కంపెనీ మేనేజర్ భారత్, రైతు గూడురు స్వామిరెడ్డి, కంపెనీ ఫీల్డ్ ఆఫీసర్ వేణు, కాటిపల్లి సంజీవరెడ్డి, రాజిరెడ్డి, రామచంద్రం, పల్లె వీరయ్య, మల్లు, గాజా తిరుపతి, సామల కోటిరెడ్డి, గూడురి చైతన్యరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మల్లాపూర్‌లో ఇద్దరు కానిస్టేబుళ్ల సస్పెన్షన్

మల్లాపూర్, మార్చి, 28: జగిత్యాల జిల్లా మల్లాపూర్ పోలీసు స్టేషన్‌లోనే ఇద్దరు కానిస్టేబుళ్లను సస్పెండ్ చేస్తూ ఎస్పీ సన్ ప్రీత్‌సింగ్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈనెల 17న మల్లాపూర్ పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్ ధనుంజయ్, సురేష్, హెడ్ కానిస్టేబుల్ అశోక్ అను ముగ్గురు మండలంలోని కొత్తధాంరాజుపల్లి, గుండంపల్లి గ్రామాలకు చెందిన ఇద్దరు రాజకీయ నాయకులతో కలిసి రాత్రి పోలీసు స్టేషన్‌లో చేసుకున్న మందు పార్టీ వెలుగులోకి వచ్చింది. ప్రజలకు బాధ్యతగా ఉండాల్సిన పోలీసు సిబ్బంది తమ విధులను మరిచి రాజకీయ నాయకులతో కలిసి విందు చేసుకున్న ఘటనపై ఉన్నతాధికారులకు తెలయడంతో ధనుంజయ్, సురేష్‌లను సస్పెండ్ చేయగా హెడ్ కానిస్టేబుల్ అశోక్‌పై శాఖా పరమైన చర్యల నిమిత్తం మల్టీ జోన్-1 ఐజీకి నివేదిక పంపించినట్లు ఎస్పీ పేర్కొన్నారు. నివేదిక ఆధారంగా హెడ్ కానిస్టేబుల్‌పై చర్యలు తీసుకుంటామని ఎస్పీ తెలిపారు.

టేకు దుంగల పట్టివేత

మల్లాపూర్, మార్చి, 28 : మండలంలోని గొర్రెపల్లి గ్రామ శివారులోని అక్రమంగా నిలువ చేసిన టేకు దుంగలను అటవీ శాఖ అధికారులు డీవైఆర్‌వో చంద్రమౌళి, ఎఫ్‌బీవో సత్తార్‌లు పట్టుకున్నట్లు గురువారం తెలిపారు. అటవీ శాఖ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం...గ్రామ శివారులోని రూంలో గుర్తు తెలియని వ్యక్తులు అక్రమంగా టేకు దుంగలను నిలవ చేసిన పక్క సమాచారం మేరకు సిబ్బందితో దాడులు చేశామన్నారు. అక్రమంగా నిల్వ చేసిన టేకు దుంగలను స్వాధీనం చేసుకొని దొంగల కోసం గాలింపు చర్యలు చేస్తున్నట్లు తెలిపారు. పట్టుకొన్న టేకు దుంగల విలువ సుమారు రూ. 1,50 వేలే ఉంటుందని అంచనా వేశారు. పట్టుకున్న దుంగలను రేంజ్ టింబర్ డిపోకు తరలించినట్లు తెలిపారు. దొంగలను త్వరలోనే పట్టుకొని చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.


నిండుగా ప్రవహిస్తున్న కెనాలు

నిండుగా కాకతీయ కాలువ

- నీళ్లు లేక వరదకాలువ వెలవెల

మల్యాల, మార్చి 28: ఎస్సారెస్పీ వరదకాలువలో నీరు లేక బోసిపోతుంటే.. నిండుగా ప్రవాహంతో ఎస్సారెస్పీ కాకతీయ కెనాల్ జలకళ సంతరించుకుంది. చివరి దశలో ఉన్న వరి పంటలకు చివరి తడి అందించేందుకు ఎస్సారెస్పీ నుంచి కాకతీయ కెనాల్‌కు అధికారులు నీళ్లు వదలగా వరదకాలువలో నీరు లేక కాలువ కింద సాగు చేసిన పంటలకు తీవ్ర నష్టం వాటిల్లుతుంది. మల్యాల మండలంలో ఎస్సారెస్పీ వరదకాలువ, కాకతీయ కెనాల్ ఉన్నాయి. ఒక్క దానిలో నీరు, మరొక దానిలో నీరు లేకపోవడంలో రైతులు ఆందోళన చెందుతున్నారు.


నీరు లేక బోసిపోతున్న వరదకాలువ

కమనీయం శివపార్వతుల కల్యాణం


స్వామివారల ఉత్సవమూర్తులు

- జనసంద్రమైన వేములవాడ
- పకడ్బందీ ఏర్పాట్లు చేసిన అధికారులు

వేములవాడ, మార్చి 28: ఆది దంపతులు పార్వతీ రాజరాజేశ్వర స్వామి వారల దివ్య కల్యాణం వేములవాడ పుణ్యక్షేత్రంలో గురువారం కన్నుల పండువగా సాగింది. దక్షిణ కాశీగా, భూలోక కైలాసంగా హరిహర క్షేత్రంగా విరాజిల్లుతున్న వేములవాడ రాజరాజేశ్వరస్వామివారి దేవస్థానంలో శివపార్వతుల కల్యాణ మహోత్సవాన్ని ఆలయ అర్చకులు, వేదపండితులు అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆలయ స్థానాచార్యులు అప్పాల భీమాశంకర్ నేతృత్వంలో అర్చకులు, వేదపండితులు స్వామివారికి ముందుగా మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, కల్యాణ క్రతువును ప్రారంభించారు. తొలుత ధ్వజారోహణం అనంతరం వరుడు రాజరాజేశ్వరస్వామివారు, వధువు పార్వతీదేవి అమ్మవార్లను వేద మంత్రోచ్చరణలు, మేళతాళాలతో ఎదుర్కొన్నారు. ఆలయ ఈవో కృష్ణప్రసాద్ ఆలయం తరుపున స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించగా, మున్సిపాలిటీ తరుపున కమిషనర్ అన్వేష్ పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించారు. అనంతరం స్వామి వారల ఉత్సవమూర్తులను ఆలయ చైర్మన్ గెస్ట్‌హౌస్ ఎదురుగా ప్రత్యేకంగా అలంకరించిన వేదికపై ఉంచి అభిజిత్ లగ్న సుముహూర్తమున ఉదయం 10-50 గంటలకు వేదమంత్రోచ్చరణలు, మంగళ వాయిద్యాల మధ్య మాంగళ్యధారణ గావించారు. స్థానాచార్యులు అప్పాల భీమాశంకర్-ఇందిర దంపతులు కన్యాదాత లుగా వ్యవహరించారు. రాష్ట్ర ప్రభుత్వ విప్, స్థానిక శాసనసభ్యుడు ఆది శ్రీనివాస్, మున్సిపల్ చైర్‌పర్సన్ రామతీర్థపు మాధవి, ఆలయ అధికారులు, మున్సిపల్ కౌన్సిలర్లు, పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.


కల్యాణాన్ని తిలకిస్తున్న భక్తులు

● కల్యాణం వీక్షించేందుకు..

పార్వతీరాజరాజేశ్వరస్వామివారల కల్యాణం వీక్షించేందుకు పెద్ద సంఖ్యలో భక్తులు వేములవాడకు తరలివచ్చారు. ఈ సందర్భంగా భక్తులు, శివపార్వతులు ఒకరిపై ఒకరు తలంబ్రాలు పోసుకొని తన్మయత్వం చెందారు. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన వేలాది మంది శివపార్వతులు, భక్తులు కల్యాణోత్సవాన్ని తిలకించి మురిసిపోయారు. కల్యాణం జరుగుతున్నంత సేపు చేతిలో త్రిశూలాలను కదిలిస్తూ శివనామ స్మరణ చేశారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణం, మేన్‌రోడ్డు ప్రాంతాలు కిక్కిరిసిపోయాయి. ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన ఎల్‌ఈడీ స్ర్కీన్లపై భక్తులు స్వామివారి కల్యాణం తిలకించారు. ఆలయ ఈవో కృష్ణప్రసాద్, అధికారులు ఏర్పాట్లు పర్యవేక్షించారు. స్థానిక డీఎస్పీ కే.నాగేంద్రచారి నేతృత్వంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు. ఉత్సవాలలో భాగంగా సాయంత్రం నాలుగు గంటలకు శివపురాణం, ప్రధాన హోమం, సప్తపది, లాజాహోమము, ఔపాసనము, బలిహరణము నిర్వహించారు. అనంతరం పెద్దసేవపై స్వామివారలను ఊరేగించారు.


స్వామివారి ఎదుర్కోళ్ళు నిర్వహిస్తున్న భక్తులు


మంగళసూత్రం చూపుతున్న అర్చకుడు


పట్టువస్త్రాలు అందజేస్తున్న ఆలయ ఈవో, మున్సిపల్ కమిషనర్

రాయికల్‌లో గంజాయి పట్టివేత

● మైనర్‌తో పాటు ముగ్గురు నిందితుల అరెస్టు ● వివరాలు వెల్లడించిన డీఎస్పీ రఘుచందర్



మాట్లాడుతున్న డీఎస్పీ రఘుచందర్

రాయికల్, మార్చి 28: గంజాయి అక్రమంగా రవాణా చేస్తూ అడ్డాల వద్ద విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్న మైనర్‌తో సహా మరో ఇరువురు వ్యక్తులను గురువారం సాయంత్రం వాహనాల తనిఖీల్లో పట్టుకున్నట్లు జగిత్యాల డీఎస్పీ రఘుచందర్ తెలిపారు. జగిత్యాల పట్టణానికి చెందిన పాత నేరస్థులైన కొండూరి రాజేష్, ఆరుముల్ల సాయి కుమార్, ఓ బాలుడు జగిత్యాల నుంచి రాయికల్‌కు గంజాయిని సరఫరా చేస్తూ రాయికల్ మండలం కుమ్మరిపెల్లి స్టేజీ వద్ద పట్టుబడినట్లు డీఎస్పీ తెలిపారు. వీరి వద్ద నుంచి 1.5 కిలోల ఎండు గంజాయి, మూడు సెల్‌ఫోన్‌లు, ఒక బైక్‌ను స్వాధీనం చేసుకుని నిందితులను కోర్టులో హాజరుపరుచనున్నట్లు తెలిపారు. రాయికల్ పోలీస్‌స్టేషన్‌లో గురువారం రాత్రి విలేకరుల సమావేశంలో కేసు వివరాలను డీఎస్పీ వెల్లడించారు. ఇటీవల గంజాయి కేసులో రిమాండ్ అయిన పెనుగొండ గణేష్, మాలావత్ సతీష్‌తో జగిత్యాల పట్టణానికి చెందిన కొండూరి రాజేష్, ఆరుముల్ల సాయి కుమార్‌తో పాటు మరో బాలుడు ఒక గ్రూప్‌గా ఏర్పడ్డారు. వీరు సీసీఎల్ దగ్గరికి వెళ్లి తక్కువ ధరకు గంజాయి కొనుగోలు చేసి జగిత్యాల జిల్లాకు అక్రమంగా తీసుకువచ్చి ఎక్కువ ధరకు విక్రయిస్తున్నట్లు తమ విచారణలో తేలిందన్నారు. ఈ గ్రూప్ సభ్యుల్లో కొందరు మైనర్లకు గంజాయిని అలవాటు చేశారని, ఈ నేపథ్యంలోనే ఈ నెల 25న గంజాయి తక్కువ ధరకు విక్రయించి గురువారం రాయికల్‌కు అక్రమంగా తీసుకువస్తుండగా తమ వాహనాల తనిఖీలో అనుమానాస్పదంగా కనిపించడంతో పట్టుకుని విచారించామన్నారు. వీరిని పట్టుకోవడంలో కృషి చేసిన సీఐ, ఎస్సై, పోలీస్ సిబ్బందిని డీఎస్పీ అభినందించారు. పట్టుబడిన ఇరువురు నిందితులపై జగిత్యాల, వరంగల్ జిల్లాల్లోని మూడు స్టేషన్‌ల పరిధిలో పాత కేసులు ఉన్నాయని వివరించారు. ఈ సమావేశంలో జగిత్యాల రూరల్ సీఐ ఆరిఫ్ అలీ ఖాన్, ఎస్సై అజయ్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

● నా కుమారుడు ఎలాంటి తప్పు చేయలేదు..

నా కుమారుడు ఎలాంటి తప్పు చేయలేదని ఆరుముల్ల సాయి కుమార్ తల్లిదండ్రులు గంగాధర్, రజిత అన్నారు. గతంలో సాయి కుమార్ తప్పు చేసినప్పుడు పలు కేసులు నమోదయ్యాయని, ఆరు మాసాలుగా ఇంటి వద్దే ఉండి పని చేసుకుంటున్నాడని అన్నారు. తన కుమారుడు ఎటువంటి తప్పు చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై డీఎస్పీ మాట్లాడుతూ తమ వద్ద ఆధారాలు ఉన్నాయని, అందుకే అరెస్టు చేశామని తెలిపారు.

గంజాయి తరలిస్తున్న ఇద్దరి అరెస్టు

పెగడపల్లి: అక్రమంగా గంజాయి తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను పట్టుకుని పెగడపల్లి పోలీసులు కేసు నమోదు చేశారు. గురువారం పెగడపల్లి పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జగిత్యాల డీఎస్పీ రఘుచందర్ వివరాలు వెల్లడించారు. కరీంనగర్ జిల్లా గంగాధర మండలం కొండాయపల్లికి చెందిన ఇడుగునూరి వంశీకృష్ణ , మరో బాలుడు అక్రమంగా గంజాయి తరలిస్తుండగా స్థానిక నంది చౌరస్తా వద్ద పట్టుకున్నట్లు తెలిపారు. ఆదిలాబాద్ జిల్లా నుంచి ద్విచక్ర వాహనంపై గంజాయి తీసుకుని వస్తుండగా నంది చౌరస్తా వద్ద పెగడపల్లి ఎస్.ఐ జాడి రామకృష్ణ ఆధ్వర్యంలో పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తుండగా వారు పారిపోయే ప్రయత్నం చేశారు. దీంతో వెంబడించి పట్టుకున్నట్లు తెలిపారు. వారిని తనిఖీ చేయగా వారి వద్ద ఉన్న బ్యాగులో 900 గ్రాములు గంజాయి లభించినట్లు తెలిపారు. గంజాయి, ద్వాచక్ర వాహనం స్వాధీనం చేసుకుని వారిపై కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నట్లు డిఎస్పీ రఘుచందర్ వివరించారు. ఈ సమావేశంలో మల్యాల సీఐ నీలం రవి, పెగడపల్లి ఎస్.ఐ జాడి రామకృష్ణ, ఏఎస్ఐ సత్తయ్య, పోలీస్ సిబ్బంది రవీందర్, వెంకట్ రెడ్డి, తిరుపతి, ఎల్లయ్య తదితరులు ఉన్నారు. ఈ సందర్భంగా గంజాయి తరలిస్తున్న వ్యక్తులను పట్టుకున్న పోలీస్ సిబ్బందిని జిల్లా ఎస్పీ సన్ ప్రీత్ సింగ్ అభినందించారు.

హత్యకేసులో నిందితుడికి జైలు

మంథని, మార్చి 28: హత్యాయత్నానికి పాల్పడిన నిందితుడికి 3 ఏళ్ల జైలు శిక్ష, రూ.3వేల జరిమానా విధిస్తూ మంథని సీనియర్ సివిల్ జడ్జి భారతి గురువారం తీర్పునిచ్చారు. మంథని మండలం బట్టుపల్లి గ్రామానికి చెందిన గుండ్ల సదయ్య అనే వ్యక్తి అదే గ్రామానికి చెందిన దూపం శ్రీనివాస్ ఇంట్లోకి 11మే 2023న అక్రమంగా చొరబడి గొడ్డలితో దాడి చేశాడు. దీంతో బాధితుడు శ్రీనివాస్ భార్య దూపం స్వప్న మంథని పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. అప్పటి ఎస్ఐ వెంకటేశ్వర్ కేసు నమోదు చేసి విచారణ అనంతరం నిందితుడు సదయ్యను రిమాండ్‌కు తరలించారు. కేసు విచారణ పూర్తి అనంతరం మంథని కోర్టులో పోలీసులు చార్జిషీటు దాఖలు చేశారు. ఇరువురి వాదనలు విన్న అనంతరం న్యాయమూర్తి భారతి నిందితుడు గుండ్ల సదయ్య దాడి పాల్పడినట్లు నేరం రుజువు కావడంతో 3 సంవత్సరాల జైలు శిక్షతో పాటు జరిమానాను విధించారు.

డ్రంకెన్‌డ్రైవ్ కేసులో ఐదుగురికి జైలు శిక్ష

కరీంనగర్ క్రైం, మార్చి 28: డ్రంకెన్‌డ్రైవ్ కేసులో ఒక వ్యక్తికి ఏడు రోజుల జైలు శిక్ష మరొకరికి ఐదు రోజుల జైలు శిక్ష, ముగ్గురు వ్యక్తులకు మూడు రోజుల జైలు శిక్షతోపాటు జరిమానా పడిందని కరీంనగర్ ట్రాఫిక్ సీఐ కరీంఉల్లాఖాన్ తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడుపుతూ ఇటీవల పోలీసులకు పట్టుబడిన 15 మందిని గురువారం కరీంనగర్ మున్సిఫ్ మెజిస్ట్రేట్ ఎదుట హాజరు పరచగా ఐదుగురికి జైలు శిక్ష, మొత్తం 9,500 రూపాయల జరిమానా విధించినట్లు తెలిపారు. మిగతా 10 మందికి 19,500 రూపాయల జరిమానా విధించారని తెలిపారు. ఇప్పటి వరకు ఈ సంవత్సరములో 102 మందికి జైలు శిక్ష పడిందని సీఐ పేర్కొన్నారు. జైలు శిక్ష పడిన వ్యక్తుల డ్రైవింగ్ లైసెన్స్‌లు సస్పెండ్ చేయడానికి ఆర్టీఏ కార్యాలయానికి సిఫారసు చేస్తామన్నారు.

నర్సింగాపూర్‌లో చోరీ


పరిశీలిస్తున్న పోలీసులు

చందుర్తి, మార్చి 28: చందుర్తి మండలం నర్సింగాపూర్ గ్రామంలో ఒకరి ఇంట్లో గుర్తులేని వ్యక్తులు చొరబడి వెండి పట్టగొలుసులు ఎత్తుకెళ్లారు. గ్రామస్తుల కథనం ప్రకారం గ్రామానికి చెందిన భైరగోని మల్లేశం అనే వ్యక్తి వేములవాడలోని ఉంటాడు. నర్సింగాపూర్ గ్రామంలో ఉండే ఇంట్లో భద్రపరిచిన 10 తులాల వెండి పట్టగొలుసులను తీసుకెళ్లేందుకు గ్రామానికి గురువారం రాగ ఇంటి తలుపుల తాళం పగలగొట్టి ఉంది. ఇంట్లోకి వెళ్లి చూడగ 10 తులాల పట్టా గొలుసులు ఎత్తుకెళ్లినట్లు తెలిపారు. పోలీసులకు ఫిర్యాదు చేయడంతో సంఘటన స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు.

కారు, బైకు ఢీ.. వృద్ధురాలు మృతి

కాల్వశ్రీరాంపూర్, మార్చి 28: కారు, బైకు ఢీకొని వృద్ధురాలు మృతిచెందిన సంఘటన మండలంలోని మిర్జంపేటలో చోటుచేసుకుంది. మృతురాలి బంధువులు చెప్పిన వివరాల ప్రకారం.. ఓదెల మండలం గుంపుల గ్రామానికి చెందిన తిప్పారపు ఓదమ్మ(75) తన మనవడు విగ్నేష్‌తో కలిసి మండలంలోని మిర్జంపేటలో దశదిన కార్యక్రమానికి వచ్చి గురువారం ద్విచక్ర వాహనంపై తిరిగి గుంపులకు వెళుతుండగా గ్రామ శివారులో ప్రమాదవశాత్తు కారు, ద్విచక్ర వాహనం ఢీకొన్నాయి. దీంతో ద్విచక్ర వాహనం వెనుక కూర్చున్న ఓదెమ్మ తలకు బలమైన గాయాలై అక్కడికక్కడే మృతిచెందింది. తిప్పారపు మహేష్ తలకు, కాళ్లకు బలమైన గాయాలయ్యాయి. చావు బతుకుల్లో కొట్టుమిట్టాడుతున్న విగ్నేష్‌ను కుటుంబ సభ్యులు మెరుగైన వైద్యం కోసం కరీంనగర్‌కు తరలించారు. ఈ విషయంపై స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా ఎస్ఐ ఓంకార్ యాదవ్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

సీయూఈటీ పరీక్షకు దరఖాస్తు చేసుకోవాలి

- ఎన్‌టీఏ సిటీ కోఆర్డినేటర్ లలితకుమారి

తిమ్మాపూర్, మార్చి28: అర్హులైనా అభ్యర్థులు సీయూఈటీ పరీక్షకు దరఖాస్తు చేసుకునే విధంగా ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల ప్రిన్సిపాళ్లు, యాజమాన్యం విద్యార్థులకు అవగాహన కల్పించాలని ఎన్‌టీఏ సిటీ కోఆర్డినేటర్ లలితకుమారి గురువారం ఒక ప్రకటనలో కోరారు. నేషనల్ టెస్టింగ్ ద్వారా నిర్వహించే కామన్ యూనివర్శిటీ ఎంట్రన్స్ టెస్ట్(సీయూఈటీ(యూజీ)- 2024)ను కేంద్ర విద్యా శాఖ, యూజీసీ తప్పనిసరి చేసిందని నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టీఏ) సిటీ కోఆర్డినేటర్ డాక్టర్ టి లలితకుమారి తెలిపారు. ఈ పరీక్ష కేంద్ర విద్యా శాఖ పరిధిలో ఉండే కేంద్ర విశ్వ విద్యాలయాలు, ఇతర విశ్వ విద్యాలయాలు, సంస్థలు, స్వయం ప్రతిపత్తి కళాశాలలో, అండర్ గ్రాడ్యుయేట్ కోర్సు కోసం నిర్వహించే ప్రవేశ పరీక్ష అని తెలిపారు. ఈసీయూఈటీ పరీక్ష దేశంలోని అన్ని కేంద్ర విశ్వ విద్యాలయాలు, ఇతర ప్రైవేటు విశ్వ విద్యాలయాలలో ప్రవేశం పొందడానికి అవకాశం కల్పిస్తుందని చెప్పారు. ప్రస్తుతం దేశ వ్యాప్తంగా 200 విశ్వవిద్యలయాలు, 46 కేంద్ర విశ్వ విద్యాలయాలు, 30 రాష్ట్ర విశ్వ విద్యాలయాలు, 9 డీమ్డ్(స్వయం ప్రతి పత్తి), 113 ప్రైవేటు విశ్వవిద్యాలయాలు, 6 ప్రభుత్వ విశ్వవిద్యాలయాలు ఉన్నాయని తెలిపారు. ఈసీయూఈటీ(యూజీ)-2004 వెబ్ సైట్‌లో ఫిబ్రవరి-2024న ప్రారంభించినట్లు చెప్పారు. మార్చి 31లో గడువు ముగియనుందని తెలిపారు. అర్హులైన అభ్యర్థులు https//exams.nta.ac.in/CUET-UGలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అర్హులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ధర్మపురిలో ఘనంగా వేంకటేశ్వరుడి

దక్షిణ, ఉత్తర దిగ్యాత్రలు


ప్రత్యేక పూజలు చేస్తున్న అర్చకులు

ధర్మపురి, మార్చి 28: ధర్మపురి క్షేత్రంలో జరిగే బ్రహ్మోత్సవాల్లో భాగంగా శ్రీ వేంకటేశ్వర స్వామి దక్షిణ, ఉత్తర దిగ్యాత్రల కార్యక్రమాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఆలయ వేద పండితులు బొజ్జ రమేష్‌శర్మ తదితర వేద బ్రాహ్మణుల మంత్రోచ్చరణల మధ్య అర్చకులు స్వామి వారల ఉత్సవమూర్తిని సేవపై ఆశీనులు చేశారు. అనంతరం సేవను దక్షిణ దిశలో గల పోలీస్‌స్టేషన్, ఉత్తర దిశలో గల ఉసిరిక వాగు వద్దకు ఊరేగింపుగా తీసుకువెళ్లారు. స్వామి వారల కళ్యాణం, తెప్పె, డోలోత్సవం అనంతరం దక్షిణ, ఉత్తర దిగ్యాత్రల కోసం బయలు దేరడం ఏటా జరుగుతుంది. ఈ సందర్భంగా ఆయా ప్రదేశాల్లో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదికల వద్ద సనాతన సాంప్రదాయ రీతిలో వేదపండితులు మంత్రోచ్చరణల మధ్య ఆలయ ఉప ప్రధాన అర్చకులు నేరెళ్ల శ్రీనివాసాచార్య, యజ్ఞాచార్యులు కందాలై పురుషోత్తమాచార్యులు, తదితరులు రాత్రి వరకు ఉత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. భక్తులు స్వామి వారలను దర్శనం చేసుకున్నారు. దారి పొడవుగా మహిళలు మంగళ హారతులతో స్వాగతం పలికారు. ధర్మపురి సీఐ రాంనర్సింహారెడ్డి దంపతులు, ఎస్ఐ ఉదయ్‌కుమార్ దంపతులు, బుగ్గారం ఎస్ఐ శ్రీధర్‌రెడ్డి, పోలీస్ కుటుంబ సభ్యులు వేదికల వద్ద ప్రత్యేక పూజలు జరిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, ఉత్సవ కమిటీ చైర్మన్ జక్కు రవీందర్, ఉత్సవ కమిటీ సభ్యులు రాపర్తి సాయి కిరణ్, మాదాసు మల్లేష్, స్తంభంకాడి గణేష్, కొమురెల్లి పవన్‌కుమార్, డాక్టర్ మామిడి రాజేష్, పెరుమాండ్ల ఎల్లాగౌడ్, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


స్వామి వారికి ఊరేగింపు నిర్వహిస్తున్న భక్తులు

ఎండిపోతున్న హుస్సేనిమియా వాగు

- ఆందోళనలో ఆయకట్టు రైతులు - ఎస్సారెస్పీ నీటిపైనే ఆశలు



నీరులేక ఎండిపోతున్న హుస్సేనిమియా వాగు

జూలపల్లి, మార్చి 28 : మండలంలోని పెద్దాపూర్ పెద్దచెరువు నుంచి జీవం పోసుకున్న హుస్సేనిమి యా నీరు లేక అడుగంటిపోతుండడంతో ఆయకట్టు రైతులు ఆందోళన చెందుతున్నారు. రోజురోజుకు వాగులో నీరు గణనీయంగా తగ్గిపోతూ ఇసుక మేటలు, రాళ్లు తేలడంతో ఆయకట్టు రైతులకు సాగునీరు అందక పంటలను రక్షించుకునేందుకు నానా అవస్థలు పడుతున్నారు. మండల పరిధిలో గల ఆయకట్టు రైతులతోపాటు పెద్దపల్లి నియోజకవర్గంలోని ఎలిగే డు, పెద్దపల్లి, సుల్తానాబాద్, ఓదెల, కాల్వశ్రీరాంపూర్ మండలాల రైతుల భూములకు సాగునీరందించి ఆదుకున్న హుస్సేనిమియా వాగు అడుగంటిపోతుండడంతో చివరి ఆయకట్టు రైతులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. ప్రస్తుతం పంటలు చివరి దశకు చేరుకున్న సమయంలో సాగు నీరు లేక ఎండిపోయి అప్పులపాలయ్యే పరిస్థితులు నెలకొన్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. హుస్సేనిమియావాగులో నీరు లేకపోవడంతో ఎస్సారెస్పీ నీటిపైనే ఆయకట్టు రైతులు ఆశలు పెంచుకున్నారు. జిల్లా ఉన్నతాధికారులు దృష్టి సారించి ఎస్సారెస్పీ నీటిని వాగులోకి వదలి ఆయకట్టు పంటలను కాపాడాలని రైతులు కోరుతున్నారు.

పరిసరాల పరిశుభ్రతపై అవగాహన

కాల్వశ్రీరాంపూర్, మార్చి 28: మండలంలోని తెనుగుపల్లె గ్రామంలో గురువారం సమాచార పౌర సంబంధాల శాఖ ఆధ్వర్యంలో ఓటు హక్కు, పరిసరాల పరిశుభ్రత, బేటి బచావో బేటి పడావో అంశాలపై తెలంగాణ సంస్కృతిక సారధి కళాబృందం పాటల ద్వారా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాకారులు జనగామ రాజనర్సు, ఈదునూరి పద్మ, బుర్ర శంకర్‌గౌడ్, కొంద్రా వెంకన్న గౌడ్, ఇల్లందుల మల్లేశం గౌడ్, సలేంద్ర రాజన్న, జిన్నా రమ, కన్నూరి రేణుక, శ్రీవల్లి పాల్గొన్నారు.

కళాకారుడి కుటుంబానికి చేయూత

కమాన్‌పూర్, మార్చి 28: రామగిరి మండలంలోని బేగంపేట గ్రామానికి చెందిన దేవుని రాజమ్మ మృతి చెందగా వారి కుమారుడైన కళాకారుడు రవివర్మకు గురువారం కమాన్‌పూర్ లైన్స్ క్లబ్ అధ్యక్షులు సాన రామకృష్ణారెడ్డి రూ. 3 వేల నగదును అందజేశారు.ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ప్రధాన కార్యదర్శి నల్లవెల్లి శంకర్ ఉన్నారు.

నిరుపేద యువతి వివాహానికి చేయూత

రామగిరి, మార్చి 28: మండలంలోని లొంకకేసారం గ్రామానికి చెందిన నిరుపేదయువతి నాంసాని సుస్మిత వివాహ ఖర్చులకు గురువారం సెంటినరీకాలనీ లయన్స్‌క్లబ్ పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు సాదుల వెంకటేశ్వర్లు చేతుల మీదుగా రూ.11,116 ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ నాయకులు మీసాల సత్యనారాయణ, ముల్కామూరి శ్రీనివాస్, గంట వెంకటరమణరెడ్డి, చెల్కపురి ఒదెలు, మేకల మారుతీ, ఒజ్జె ఓదెలు, తదితరులు పాల్గొన్నారు.

పాలకుర్తిలో..

పాలకుర్తి,మార్చి 28: మండలం పరిధిలోని బామ్లానాయక్ తండాలో గురువారం బదావత్ చందర్-కమల దంపతుల కుమార్తె వివాహం జరిగింది. పెళ్లికి హాజరైన తండా తాజా మాజీ సర్పంచ్ రాజునాయక్ నూతన వధువరులను ఆశీర్వదించి 10వేల రూపాయలను అందించారు.

ప్రమాదకరంగా లోలెవల్ వంతెన

పాలకుర్తి, మార్చి 28:మండలం పరిధిలోని పుట్నూర్-గుడిపెల్లి గ్రామాల మధ్య నిర్మించిన లోలెవల్ వంతెనకు రెండు పక్కల రక్షణ గోడ నిర్మించలేదు. దీంతో పాటు రహదారికి ఇరుపక్కల చెట్లు పెరిగి రొడ్యాం రాత్రి సమయంలో ఎదురు ఎదురుగా వచే వాహనదారులకు కనిపించని పరిస్థితి నెలకొంది. దీంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఎక్కువగా ఉంది. ఆ దారి గుండా వెళుతున్న వాహనదారులు రోడ్డు రోడ్యాం వద్ద ప్రమాదకరంగా మారిందని పేర్కొంటున్నారు. జయ్యారం కంకర క్రషర్ల నుంచి నిత్యం టిప్పర్ లారీలు ధర్మారం అడ్డరోడ్డు వద్ద ఉన్న కంకర క్రషర్లకు బండరాయిని తరలిస్తుంటాయి. అలాగే గోదావరిఖని నుంచి ధర్మారం వరకు ఆర్టీసీ బస్సు నడుస్తుంది. నిత్యం రద్దీగా ఉండే రోడ్డులో ఇరుకు రొడ్యాంకు రెండు పక్కల పెరిగిన చెట్లను తొలగించి, సూచిక బోర్డులను ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు. లేనిపక్షంలో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని, ఇప్పటికైనా అధికారులు చర్యలు చేపట్టాలని వాహనదారులు కోరుతున్నారు.



రక్షణ గోడ లేని లోలెవల్ వంతెన

కట్ట మైసమ్మ విగ్రహ ప్రతిష్ఠ



పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే విజయరమణారావు దంపతులు

పెద్దపల్లిటౌన్, మార్చి 28: పట్టణ కేంద్రంలోని ఎల్లమ్మ చెరువు కట్ట సమీపంలో నూతనంగా నిర్మించిన శ్రీకట్టమైసమ్మ తల్లి, సుబ్రహ్మణ్యస్వామి (జంట నాగులు) దేవాలయ మూర్తి ప్రతిష్ఠ మహోత్సవ కార్యక్రమంలో గురువారం ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు కుటుంబ సమేతంగా పాల్గొని ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే దంపతులను ఆలయ అర్చకులు ఆశీర్వదించి అమ్మవారి ప్రతిమను బహూకరించారు. కార్యక్రమంలో బొడ్డుపల్లి శ్రీనివాస్, బొడ్డుపల్లి జగదీష్, నూగిల్ల మల్లయ్య, భూతగడ్డ సంపత్, ఉప్పు రాజు, తూముల సుభాష్‌రావు, తాండూరి శ్రీమాన్, సయ్యద్ మస్రత్, భుషనవెని సురేష్‌గౌడ్ పాల్గొన్నారు.

రేణుక ఎల్లమ్మ కల్యాణ మహోత్సవం

కమాన్‌పూర్, మార్చి 28: మండల కేంద్రంలోని పిల్లిపల్లీలో గల రేణుక ఎల్లమ్మ కల్యాణ వేడుకలు వేదపండితుల మంత్రోచ్ఛరణాల మధ్య గణపతి పూజోత్సవంతో అంగరంగ వైభవంగా ప్రారంభమైంది. వారం రోజుల పాటు వేడుకలు జరగనున్నాయి. డప్పుచప్పుళ్ల మధ్య రేణుక ఎల్లమ్మ ఆలయం నుంచి పాలపోరుక వేసే కార్యక్రమాన్ని నిర్వహించారు. కమాన్‌పూర్‌లోని గౌడ కులస్థులతో పాటు వివిధ వర్గాల ప్రజలు పూజలు నిర్వహించారు.

మహాగణపతి ఆలయంలో చతుర్థి వేడుకలు

మంథని, మార్చి 28: స్థానిక మంత్రపురి శ్రీమహాగణపతి ఆలయంలో చుతుర్థి వేడుకలను భక్తులు గురువారం వైభవంగా నిర్వహించారు. సంకటహర చతుర్థిని పురస్కరించుకొని శ్రీమహాగణపతి స్వామి వారికి ఆలయ ప్రధాన అర్చకులు పల్లి రాముశర్మ ఆధ్వర్యంలో భక్తులు స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు చేశారు.

భక్తాంజనేయ ఆలయంలో నవగ్రహ విగ్రహ ప్రతిష్ఠ

యైటింక్లయిన్‌కాలనీ, మార్చి 28: కాలనీలోని శ్రీ భక్తాంజనేయ స్వామి ఆలయంలో గురువారం నవగ్రహ విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం అత్యంత భక్తి శ్రద్ధలతో జరిగింది. హోమం, మహా పూర్ణాహుతి, కుంభ ఉద్వాసన, సీతారామ లక్ష్మణ హనుమాన్ స్వావి నేత్ర ఉన్మలనం వంటి పూజలను అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు.

ఆలయాల్లో హుండీల లెక్కింపు

మంథని, మార్చి 28: పట్టణంలోని మూడు ప్రధాన ఆలయాల్లో హుండీలను ఎండోమెంట్ అధికారులు, భక్తులు గురువారం లెక్కించారు. స్థానిక శ్రీలక్ష్మీనారాయణస్వామి ఆలయంలో సంవత్సర కాలం హుండీని లెక్కించగా రూ.లక్షా 9వేల 500, శ్రీమహాలక్ష్మి ఆలయంలో 6నెలల హుండీని లెక్కించగా రూ.లక్షా 5వేల 794, శ్రీగౌతమేశ్వరస్వామి ఆలయంలో సంవత్సర కాలం హుండీని లెక్కించగా రూ.15వేల473 ఆదాయం వచ్చినట్లు ఎండోమెంట్ మేనేజర్ రాజ్‌కుమార్ తెలిపారు. ఈకార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్ సుజాత, జూనియర్ అసిస్టెంట్ బెజ్జాల రవికిరణ్, భక్తులు పాల్గొన్నారు.

నేడు గుడ్ ఫ్రైడే



ముస్తాబైన సీయోను చర్చి

మంథని, మార్చి 28: గుడ్‌ఫ్రైడే, ఈస్టర్ వేడుకలకు మంథని పట్టణంలోని పలు చర్చిలు ముస్తాబయ్యాయి. క్రైస్తవులందరూ గుడ్‌ఫ్రైడేను ఎంతో పవిత్రమైన రోజుగా పరిగణిస్తారు. ఏసుక్రీస్తుకు శిలువ వేసిన రోజును గుర్తు చేసుకుంటూ గుడ్‌ఫ్రైడే వేడుకలను జరుపుకుంటారు. ఈ సందర్భంగా మంథని నియోజకవర్గంలోని చర్చిలలో పెద్ద ఎత్తున నిర్వహించేందుకు పాస్టర్లు సంఘ పెద్దలు ప్రత్యేక ఏర్పాట్లు చేసుకున్నారు.

అండర్‌గ్రౌండ్ గ్యాస్ పైప్‌లైన్ లీకేజీపై మాక్ డ్రిల్



అండర్ గ్రౌండ్ గ్యాస్ పైప్‌లైన్ లీకేజీకి మరమ్మతులు..



మంటల ఆర్పివేత..

యైటింక్లయిన్‌కాలనీ, మార్చి 28: జీఎస్‌పీఎల్ ఇండియా ట్రాన్స్‌కో లిమిటెడ్ ఆధ్వర్యంలో ఆర్ఎఫ్‌సీఎల్ సమీపంలోని వీర్లపల్లె గ్రామ శివారులో గ్యాస్ పైప్ లైన్ లీకేజీపై గురువారం మాక్ డ్రిల్ నిర్వహించారు. భూగర్భంలోని గ్యాస్ లైన్ లీకేజీ జరిగితే సమీప ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేయడం, క్షతగాత్రులకు ప్రథమ చికిత్స అందించడం, అగ్నిమాపక శాఖ మంటలను అదుపు చేయడాన్ని ప్రదర్శించారు. రెస్క్యూ, సివిల్ నిపుణులు తక్కువ సమయంలో పైప్‌లైన్‌కు మరమ్మత్తులు చేయడాన్ని ప్రదర్శించారు. జీఎస్‌పీఎల్ సంస్థ రామగుండం ఆర్ఎఫ్‌సీఎల్ ప్లాంట్‌కు గ్యాస్‌ను సరఫరా చేస్తున్నది. ఈక్రమంలో ఏదైనా లీకేజీలు జరిగితే జరిగే పరిణామాలను ఎదుర్కొనేందుకు ఈ తరహా మాక్ డ్రిల్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రామగుండం మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్, పెద్దపల్లి ఆర్డీఓ గంగయ్య, ఏసీపీ రమేష్‌తో పాటు ఆర్ఎఫ్‌సీఎల్ అధికారులు, సీఐఎస్ఎఫ్, అగ్నిమాపక సిబ్బంది పాల్గొన్నారు.

మంత్రిని, ఎమ్మెల్యేలను కలిసిన ఐఎన్‌టీయూసీ నాయకులు

యైటింక్లయిన్‌కాలనీ, మార్చి 28: సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మంత్రి శ్రీధర్‌బాబు, ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్‌లను జనక్ ప్రసాద్ ఆధ్వర్యంలో ఐఎన్‌టీయూసీ నాయకులు వినతి పత్రం సమర్పించారు. ఇందుకు మంత్రి సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో సెంట్రల్ వైస్ ప్రెసిడెంట్ నరసింహారెడ్డి, ఆర్జీ2 వైస్ ప్రెసిడెంట్ సత్యనారాయణరెడ్డి, ప్రభాకర్, ప్రణయ్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

మైనార్టీ బాలికల పాఠశాలలో ఆర్ట్ అండ్ క్రాఫ్ట్ ఎగ్జిబిషన్

పెద్దపల్లి కల్చరల్, మార్చి 28 : రంగంపల్లి మైనార్టీ బాలికల పాఠశాలలో బేటీ బచావో, బేటి పడావో కార్యక్రమంలో భాగంగా గురువారం ఆర్ట్ అండ్ క్రాఫ్ట్ ఎగ్జిబిషన్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మహిళా సాధికారత కేంద్రం జెండర్ స్పెషలిస్ట్ సుచరిత మాట్లాడుతూ బాలికలు మహిళా చట్టాలు, సంరక్షణ, హెల్ప్ లైన్ నంబర్స్ సఖి కేంద్రం సేవలు, గుడ్, బ్యాడ్ టచ్ వంటి అంశాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఎగ్జిబిషన్‌లో మంథని, రంగంపల్లి మైనారిటీ రెసిడెన్షియల్ స్కూల్ విద్యార్థినులు తయారు చేసిన ఆర్ట్‌అండ్‌క్రాఫ్ట్ ప్రాజెక్టులను ప్రదర్శించారు. పాఠశాల ప్రిన్సిపాల్ భాగ్యలక్ష్మి, డీసీపీవో పర్వీన్, ఎండబ్ల్యూడి సూపరింటెంట్ ఫర్హాన్, సీనియర్ అసిస్టెంట్ అఫ్సన్, ఆర్ట్ టీచర్స్ వాణి, కల్పన, తదితరులు పాల్గొన్నారు.

విగ్రహాల పునఃప్రతిష్ఠాపన వేడుకలు

జూలపల్లి, మార్చి 28 : మండలంలోని కోనరావ్‌పేటలో గురువారం పోచమ్మతల్లి బోనాలు, భూలక్ష్మి, మహాలక్ష్మి విగ్రహాల పునఃప్రతిష్ఠాపన వేడుకలను గ్రామ ప్రజలు అత్యంత భక్తిశ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. ఈ వేడుకలకు గ్రామస్తులంతా అధిక సంఖ్యలో తరలివచ్చి మంగళ హారతులు డప్పులచప్పుల్లతో బైండ్ల పూజారుల పూనకాలతో ఉత్సవమూర్తుల విగ్రహాలను పునఃప్రతిష్ఠాపన చేశారు. ఈసందర్భంగా ఉత్సవమూర్తులకు ప్రజలు పూజలు చేసి మొక్కులను తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు నల్ల మనోహర్‌రెడ్డి, రవిందర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ మంగా, రాయమల్లు, హన్మంతు తదితరులు పాల్గొన్నారు.

స్థలం చూపిస్తే వారసంతకు గదుల నిర్మాణం

- నాబార్డు ఏజీయం జయప్రకాష్

ఓదెల, మార్చి 28 : గ్రామపంచాయతీలో స్థలం చూపిస్తే వార సంతకు గదులను నిర్మిస్తామని కరీంనగర్ క్లస్టర్ నాబార్డు ఏజీఎం జయప్రకాష్ తెలిపారు. గురువారం ఏజీఎం జయప్రకాష్ ఓదెలలో నిర్వహిస్తున్న వారసంతను సందర్శించారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ గ్రామ పంచాయతీ సమావేశ తీర్మానం అందజేసి స్థలాన్ని చూపిస్తే సొంత నిధులతో చిరు వ్యాపారస్తుల సౌకర్యార్థం గదులను నిర్మిస్తామని తెలిపారు. అధికారి వెంట మాజీ ఎంపీటీసీ బోడకుంట స్వామి, రామినేని సునీల్ ఉన్నారు.

గురుకుల పాఠశాలలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

పెద్దపల్లి కల్చరల్, మార్చి 28 : తెలంగాణ సాంఘిక సంక్షేమ, గిరిజన సంక్షేమ గురుకుల విద్యాసంస్థలలో 6,7,8,9 తరగతులలో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి, అదేవిధంగా కరీంనగర్, గౌలిదొడ్డి సీవోఈలలో 9వ తరగతిలో రెగ్యులర్ ప్రవేశాల కోసం ప్రవేశపరీక్ష ఏప్రిల్ 21న జరుగనుంది. దీనికి దరఖాస్తు చేసుకోవటానికి ఆఖరుతేది మార్చి 30వరకు పొడిగించబడింది. కరీంనగర్ సీఓఈలో 80 సీట్లు బాలురకు, 80 సీట్లు బాలికలకు, గౌలిదొడ్డిలో 80 సీట్లు బాలికలకు, 9వ తరగతిలో ఉన్నాయి. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా సాంఘిక సంక్షేమ సమన్వయాధికారి జె.జె. థెరిసా తెలిపారు.

సెలవు రోజుల్లోనూ పన్ను చెల్లింపు కౌంటర్లు

కోల్‌సిటీ, మార్చి 28: ఆర్థిక సంవత్సరం ముగుస్తున్నందు వల్ల సెలవు రోజుల్లోనూ రామగుండం నగరపాలక సంస్థలో పన్నుల వసూళ్లకు ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసినట్లు రామగుండం నగరపాలక సంస్థ కమిషనర్ సీహెచ్ శ్రీకాంత్ పేర్కొన్నారు. 29 గుడ్‌ఫ్రైడే, 31 ఆదివారం కూడా ఈ కౌంటర్లు పనిచేస్తాయన్నారు. ఆస్తిపన్ను, నల్లాబిల్లులు, ట్రేడ్ లైసెన్స్‌లు చెల్లించవచ్చన్నారు. బిల్ కలెక్టర్లు కూడా సెలవు దినాల్లో విధుల్లో ఉంటాయని ఆయన తెలిపారు. ఆస్తిపన్ను బకాయిలపై విధించిన వడ్డీలో 90శాతం మాఫీ ఉందని, ఈనెల 31న గడువు ముగుస్తున్నందు వల్ల ప్రజలు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ కోరారు.

మదర్ థెరిస్సా ఇంజనీరింగ్ కళాశాలలో ముగిసిన టెక్నికల్ వర్క్ షాప్

పెద్దపల్లి రూరల్, మార్చి 28 : తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్ వారి ఆధ్వర్యంలో మదర్ థెరిస్సా ఇంజనీరింగ్ కళాశాలలో మూడు రోజుల టెక్నికల్ వర్క్ షాప్ ముగిసింది. రిసోర్స్ పర్సన్ రత్నప్రియ, కళాశాల చైర్మన్ ఎడవెల్లి నవీన్, డైరెక్టర్ నవత, ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నిర్వాసిత గ్రామాలపై ఎన్‌టీపీసీ నిర్లక్ష్యం

అంతర్గాం, మార్చి 28: అంతర్గాం మండల పరిధిలోని ఎన్‌టీపీసీ భూ నిర్వాసిత గ్రామం కుందనపల్లిపై ఎన్‌టీపీసీ యాజమాన్యం గత కొంత కాలంగా నిర్లక్ష్యం వహిస్తోంది. ఎన్‌టీపీసీ నిర్మాణానికి సుమారు 1200 ఎకరాల తమ పంట పొలాలను త్యాగం చేసిన గ్రామస్థులు ప్రస్తుతం అసౌకర్యాలు, కాలుష్యం కోరల మధ్య సహ జీవనం చేస్తూ ఇబ్బందులకు గురవుతున్నారు. తమ పచ్చని పంట పొలాలు ఎన్‌టీపీసీకి ఇవ్వగా ఉపాధి అవకాశాలు లేక ప్రస్తుతం దినసరి కూలీలుగా మారారు. భూ సేకరణ సమయంలో నిర్వాసితులందరికి ఉపాధి అవకాశాలు కల్పిస్తామని చెప్పిన ఎన్‌టీపీసీ అధికారులు కొంత మందికే ఉపాధి కల్పించి చేతులు దులుపుకున్నారు. గ్రామంలో యాష్‌పాండ్ నిర్మాణానికి ఎన్‌టీపీసీ యాజమాన్యం సేకరించిన భూములు పోను మిగిలిన కొద్దిపాటి భూముల్లో ఎన్‌టీపీసీ బూడిద నీటి కారణంగా తుంగ మొలిచి గత 20ఏళ్లుగా భూములు సాగుకు నోచుకోవడం లేదు. దీంతో చిన్న, సన్నకారు రైతులు పంట దిగుబడులు లేక ఆర్థికంగా నష్టపోతున్నారు. పొలాల్లో ఏర్పడిన తుంగను తొలగించి మిగిలిన కొద్దిపాటి భూములు సాగుకు ఉపయోగపడేలా కృషి చేయాలని ఎన్‌టీపీసీ యాజమాన్యాన్ని రైతులు కోరుతున్నారు.



పని చేయని వాటర్ ప్లాంట్

గ్రామంలో శిథిలమైన రహదారులు

నిర్వాసిత గ్రామాల్లో మౌలిక సదుపాయల కల్పనలో భాగంగా 20ఏళ్ల క్రితం ఎన్‌టీపీసీ కుందనపల్లి పంచాయతీ పరిధిలోని కుందనపల్లి, మొగల్‌పహాడ్, అక్బర్‌నగర్, బద్రిపల్లి గ్రామాల్లో వేసిన రహదారులు శిథిలావస్థకు చేరి గుంతల మయం కావడంతో ప్రజలు నడవలేని పరిస్థితి నెలకొన్నది. రహదారుల నిర్మాణంపై ఎన్‌టీపీసీ యాజమాన్యానికి కొన్నిరోజులుగా మొర పెట్టుకుంటున్నా పట్టించుకోవడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎన్‌టీపీసీ నిర్లక్ష్య వైఖరి పట్ల గ్రామస్థులు సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కుందనపల్లి పంచాయతీ పరిధిలోని రాజీవ్ రహదారి ఐటీసీ ప్రాంతం నుంచి అక్బర్‌నగర్ వరకు గల ప్రధాన రహదారి కూడా పూర్తిగా చెడిపోవడంతో రహదారిపై ప్రయాణించడం ఇబ్బందిగా మారింది. గ్రామ పంచాయతీ పరిధిలో రహదారుల నిర్మాణం చేపట్టాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

తాగునీటికి తప్పని తిప్పలు...

ఎన్‌టీపీసీ యాజమాన్యం కుందనపల్లి పంచాయతీ పరిధిలోని గ్రామాల్లో సరఫరా చేస్తున్న తాగునీరు అన్ని ప్రాంతాలకు చేరకపోవడంతో గ్రామస్థులకు తాగునీటి తిప్పలు తప్పడం లేదు. గ్రామాల్లో ప్రధాన కూడళ్ల వద్ద ఏర్పాటు చేసిన అన్ని ప్రాంతాల నల్లాల వరకు నీరు చేరకపోవడంతో ప్రజలు ఇక్కట్లకు గురవుతున్నారు. పంచాయతీ పరిధిలోని మొగల్‌పహాడ్ వద్ద ఏర్పాటు చేసిన తాగునీటి శుద్ధి కేంద్రం సంవత్సరం నుంచి పనిచేయకపోవడంతో మొగల్ పహాడ్, ఇందిరమ్మ కాలనీల ప్రజలు తాగునీటికి ఇబ్బందులు పడుతున్నారు. ఎన్‌టీపీసీ యాజమాన్యం స్పందించి తాగునీటి శుద్ధి కేంద్రం మరమ్మతులు చేపట్టి ఉపయోగంలోకి తేవాలని ప్రజలు కోరుతున్నారు.

భూములు సాగుకు నోచుకోవడం లేదు...

- మేకల బాపు, రైతు, కుందనపల్లి



ఎన్‌టీపీసీ యాష్‌పాండ్ నిర్మాణానికి తమ విలువైన పంట పొలాలను ధారాదత్తం చేశాం. మిగిలిన కొద్దిపాటి భూముల్లో తుంగ మొలిచి 20ఏళ్లుగా సాగుకు నోచుకోవడం లేదు. ఎన్‌టీపీసీ యాజమాన్యం స్పందించి పొలాల్లో మొలిచిన తుంగను తొలగించి పంటల సాగుకు ఉపయోగపడేలా చూడాలి.

ప్రధాన రహదారి పూర్తిగా శిథిలం అయ్యింది..

- మహ్మద్ సాదిక్, అక్బర్‌నగర్



గ్రామంలోని అంతర్గత రహదారులతో పాటు ఐటీసీఎల్ రాజీవ్‌రహదారి నుంచి అక్బర్‌నగర్ వరకుగల ప్రధాన రహదారి శిథిలం కావడంతో ప్రయాణించలేని పరిస్థితి నెలకొన్నది. ఎన్‌టీపీసీ యాజమాన్యం స్పందించి కుందనపల్లి పంచాయతీ పరిధిలోని గ్రామాల్లో రహదారుల నిర్మాణం చేపట్టాలి. ప్రయాణ సౌకర్యం కల్పించాలి.

విద్యార్థుల భవిష్యత్ తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయులది కీలకపాత్ర

రామగిరి, మార్చి 28: విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయులది కీలకపాత్ర అని, విద్యాశాఖలో బాధ్యతాయుతమైన సేవలను ఎంఈవో సంపత్‌రావు అందించారని అదనపు కలెక్టర్ శ్యాంప్రసాద్‌లాల్ అన్నారు. ఈనెలలో ఎంఈవో పదవీ విరమణ పొందుతున్న సందర్భంగా గురువారం జేఎన్టీయూ కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి అదనపు కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జిల్లా విద్యాధికారి మాధవి మాట్లాడుతూ విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికితీయడంలో సంపత్‌రావు అనేక కార్యక్రమాలను చేపట్టారని కితాబునిచ్చారు. ట్రస్మా జిల్లా అధ్యక్షుడు కేశవరెడ్డి, కృష్ణవేణి టాలెంట్‌స్కూల్ ప్రిన్సిపాల్ బర్లశ్రీనివాస్, వాటి పాఠశాల పీఈటీ తిరుపతిలు ఎంఈవో దంపతులను సన్మానించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రాంచందర్‌రావు పాల్గొన్నారు.

సుల్తానాబాద్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా శ్రీరాములు



ఎన్నికైన కార్యవర్గం ప్రతినిధులు

సుల్తానాబాద్, మార్చి 28: సుల్తానాబాద్ బార్ అసోసియేషన్ ఎన్నికలు గురువారం జరిగాయి. అధ్యక్షుడిగా సీనియర్ న్యాయవాది పడాల శ్రీరాములు, ఉపాధ్యక్షుడిగా పెగడ శ్యామ్ సుందర్, సంయుక్త కార్యదర్శిగా సామల రాజేంద్ర ప్రసాద్, కోశాధికారిగా చీకటి సంతోష్ కుమార్, స్పోర్ట్స్ అండ్ కల్చరల్ కార్యదర్శిగా వడ్లకొండ రవికిరణ్, లైబ్రరీ కార్యదర్శిగా శివకృష్ణ, మహిళా ప్రతినిధిగా సంధ్యారాణి, సీనియర్ ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా లక్ష్మీరాజం, బాలకిషన్ ప్రసాద్, సరోత్తంరెడ్డి, వొడ్నాల రవీందర్, సత్యనారాయణ, జూనియర్ ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా కరుణాకర్, లక్ష్మన్, రాములు, యుగంధర్‌రెడ్డి, శ్యాం, వెంకటేశ్‌లు ఎన్నికయ్యారు. పడాల అంజయ్య, రుద్రారపు నర్సయ్య ఎన్నికల అధికారులుగా వ్యవహరించారు.

బహుజనులు రాజ్యాధికారం చేపట్టాలి

పెద్దపల్లి పార్లమెంట్ బీఎస్‌పీ ఇన్‌చార్జి కాదాసు రవీందర్

కళ్యాణ్‌నగర్, మార్చి 28: బహుజనులు రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో రాజ్యాధికారం చేపట్టాలని బీఎస్‌పీ పార్లమెంట్ ఇన్‌చార్జి కాదాసు రవీందర్ పిలుపునిచ్చారు. గురువారం గోదావరిఖని ప్రెస్‌క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బహుజనులను తరతరాలుగా అణచివేస్తూ వస్తున్నారని, పెట్టుబడిదారుల చేతుల్లోనే దేశం ఉంటుందని, పెద్దపల్లి పార్లమెంట్ పరిధిలో బహుజనులు ఏకమై ఎంపీగా గెలిపించుకోవాలని ఆయన అన్నారు. కోల్‌బెల్ట్ ప్రాంతంలో బహుజనులంతా ఏకమైతే రాజ్యాధికారం చేపట్టవచ్చన్నారు. బీఎస్‌పీలోకి ప్రవీణ్‌కుమార్ ఎందుకు వచ్చాడో, ఎందుకు వెళ్లాడో తెలియదని, ప్రవీణ్ కుమార్‌లాంటి వారు ఎంతో మంది బీఎస్‌పీలోకి వచ్చి వెళ్లారని, బీఎస్‌పీ పార్టీకి మనుషులు ముఖ్యం కాదని, పేద ప్రజల కోసం శ్రమించేది బీఎస్‌పీ పార్టీనేనని ఆయన అన్నారు. పెద్దపల్లి పార్లమెంట్‌లో రాబోయే ఎన్నికల్లో బీఎస్‌పీ అభ్యర్థిని గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. విలేకరుల సమావేశంలో బీఎస్‌పీ నాయకులు ఇరికిళ్ల రాజనర్సయ్య, కనకయ్య, శారద, అనిత, మహేష్, లింగయ్య, మల్లేష్, ఉప్పులేటి పర్వతాలు, సది, సంతోష్ పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కాదాసు రవీందర్

వైభవంగా శివకల్యాణం

ధర్మారం, మార్చి 28:మండల కేంద్రంలోని మార్కండేయ స్వామి దేవాలయంలో గురువారం శివ కల్యాణం వైభవంగా నిర్వహించారు. దేవాలయంలో రుద్రాభిషేకం చేసి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయంలో శివపార్వతుల కల్యాణంను పూజారులు జరిపారు. ఈ ఉత్సవాల్లో ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, పెద్దపల్లి ఎంపీ కాంగ్రెస్ అభ్యర్థి జి. వంశీ పాల్గొని పూజలు చేశారు. వారికి నిర్వాహకులు సన్మానం చేశారు. ఆలయ ఆవరణలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

ఢిల్లీలో మాదిగ శక్తి నేతల నిరసన

పెద్దపల్లిటౌన్, మార్చి 28: తెలంగాణాలోని 80లక్షల మంది మాదిగల ఆత్మగౌరవానికి సవాలుగా మారిన పెద్దపల్లి పార్లమెంటు సీటును గజ్జెల కాంతంకు కేటాయించాలని డిమాండ్ చేస్తూ మాదిగశక్తి ఆధ్వర్యంలో ఢిల్లీలోని ఏఐసీసీ కాంగ్రెస్ కార్యాలయం ఎదుట గురువారం నిరసన చేశారు. ఈ సందర్భంగా మాదిగశక్తి వ్యవస్థాపక అధ్యక్షుడు బొంకూరి సురేందర్ సన్ని మాట్లాడుతూ కాంగ్రెస్ నేత కల్నల్ రోహిత్ చౌదరీని కలిసి రాష్ట్రంలో మాదిగ సామజిక వర్గానికి రాజకీయంగా జరుగుతున్న అన్యాయంపై వివరించామని తెలిపారు. పెద్దపల్లి పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణ స్థానంలో మాదిగకు కేటాయించాలని డిమాండ్ చేశారు. పార్లమెంట్ పరిధిలోని చెన్నూరు, బెల్లంపల్లి ఎమ్మెల్యేలుగా అతడి కుటుంబానికి చెందిన వారికి కాంగ్రెస్ పార్టీ టికెట్ ఇచ్చారని, వారి గెలుపునకు మాదిగలు తోడ్పడ్డారని తెలిపారు. తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి రావడానికి మాదిగలు అండగా నిలబడిన విషయాన్ని అధిష్ఠానం మరిచిపోయిందన్నారు. మాదిగ జేఏసీ, మాదిగ రాజకీయ వేదిక, మాదిగ దండోరా సంఘాల నాయకులు కల్లేపల్లి రవి, సతీష్, కిషోర్, పర్వతాలు, చంద్రు, సందీప్, నర్సయ్య, పవణ్ కళ్యాణ్, మొగిలి, భూమయ్య, రాజేందర్, సుందర్, కాంతయ్య, రాజేశ్వరి, సుజాత సిరిసిల్ల నర్సయ్య, శారద పాల్గొన్నారు.

వేరుశనగ పంట క్షేత్ర ప్రదర్శన

కమాన్‌పూర్, మార్చి 28: మండలంలోని పెంచికల్‌పేట గ్రామంలో గురువారం సామూహిక ప్రథమ శ్రేణి ప్రదర్శన క్షేత్రంలో భాగంగా రామగిరి కృషి విజ్ఞాన కేంద్రం, వ్యవసాయ శాఖ సంయుక్తంగా వేరుశనగ క్షేత్ర దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మృతిక శాస్త్రవేత్త డాక్టర్ పిల్లి కిరణ్ మాట్లాడుతూ వేరుశనగ పంట యాజమాన్యం, సస్యరక్షణ గురించి రైతులకు వివరించారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి అజ్మీర సురేష్, స్పెషలాఫీసర్ మహేందర్ పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ

మంథని, మార్చి 28: మంథనిలో సీఐ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో గురువారం వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా కార్ల విండోలకు ఉన్న బ్లాక్ స్టిక్కర్లను తొలగించడంతో పాటు జరిమానా విధించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కార్ల విండోలకు బ్లాక్ స్టిక్కర్లు, అనుమతి లేని సైరన్‌లు వినియోగించినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఐ రాణివర్మ పాల్గొన్నారు.